


చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

## వందేమాతర గీతం ఇక తప్పనిసరి

**జగనణమన కంటే ముందే వందేమాతరం**

**ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి11 (చట్టం న్యూస్):** అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో ఇక నుంచి జాతీయ గీతం జనగణమన కంటే ముందుగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. ఈ మేరకు బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కొత్త నిబంధలను అమల్లోకి తెచ్చింది. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో అందరూ లేచి నిలబడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంతేకాకుండా అన్ని పౌరపురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని తెలిపింది. అయితే సినిమా హాళ్లలో దీనిని ప్రదర్శించాల్సిన అవసరం లేదని నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం


మిగతా 2వ పేజీలో..

సంపుటి : 14 ● సంచిక : 31 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi గురువారం 12 ఫిబ్రవరి 2026 ● పేజీలు : 8 ● వెల 2/-

## స్వర్ణాంధ్ర లక్ష్యంగా

# ముందుకు సాగుతున్నాం

- అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా ప్రగతి పయనం
- 19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగాం
- 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు
- విద్యుత్, సాగునీటి పారుదల రంగాల్లో తిరోగమనం
- వ్యవస్థల నిర్వీర్యంతో కుంటుపడిన అభివృద్ధి రంగం
- ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం



**అమరావతి,ఫిబ్రవరి11 (చట్టం న్యూస్):** రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలను చవిచూసిందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు రాష్ట్ర పురోగతికి విఘాతం కలిగించిందన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ప్రజా సంక్షేమం అనే కోణంలోనే.. ప్రభుత్వం ప్రతీ నిర్ణయాన్ని తీసుకుంటోందని తెలిపారు. ఏడాదికి రూ.33వేల కోట్లతో సూపర్ సిక్స్ సహా ఇతర డీబీటీ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. 63.12 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రయోజనం చేకూరుతోంద న్నారు. 66 లక్షలకు పైగా విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా ఆర్థిక సాయం అందుతోందని గవర్నర్ వెల్లడించారు. 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయి. రాష్ట్ర అభివృద్ధి స్తంభించింది. ఆర్థిక ఒత్తిడి తీవ్రమైంది. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగు నీటి పారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చవిచూశాయి. గత చేదు అనుభవాలతో విసిగి వేశారిన ప్రజలు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. గత 19 నెలలుగా మా ప్రభుత్వం పునరుద్ధరణ దశ నుంచి ప్రగతి పథం వైపు పయనిస్తోంది. సూపర్-6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపై ప్రధానంగా దృష్టి పెట్టాం. విధానాలు, వ్యవస్థలు, వ్యయ ప్రాధాన్యాలలో కీలక సవరణలు చేశాం. 7 శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశాం. సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి పది సూత్రాలు రూపొందించాం. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే దీని లక్ష్యం. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశరచిందని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుతోందని గవర్నర్ తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల చొప్పున 46.86 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతోందన్నారు. దీపం 2.0 పథకం ద్వారా 1.08 కోట్ల మంది పేద కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాటు 5,757 మంది కానిస్టేబుళ్ల రిక్రూట్మెంట్ కూడా ప్రభుత్వం పూర్తి చేసిందని వివరించారు. మత్స్యకార సేవలో పథకం ద్వారా 1.2 లక్షల మందికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతోందని తెలిపారు. లక్ష మందికి పైగా హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌లపై ఆధారపడిన చేనేత కుటుంబాలకు 200, 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తోందని గవర్నర్ చెప్పారు. విభజన సమస్యలతో పాటు వారసత్వంగా వచ్చిన ఆర్థిక నష్టాలతో ప్రభుత్వం పాలన ప్రారంభించిందని అబ్దుల్ నజీర్ చెప్పుకొచ్చారు. విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గత పాలకులు ధ్వంసం చేశారన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో అభివృద్ధి ఆగిపోయిందని.. ఆర్థికపరమైన ఇబ్బందులు పెరిగాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా గత పాలకులు పాలించారని.. 22ఏ అధికరణను దుర్వినియోగం చేశారన్నారు. మౌలిక వసతులైన విద్యుత్, సాగునీరు, రహదారులు లాంటి రంగాల్లో అభివృద్ధి కుంటుపడిందని గవర్నర్ తెలిపారు. 2024లో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసే బాధ్యతను ప్రజలు కూటమికి అప్పజెప్పారని.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ప్రభుత్వ పాలన అద్భుతంగా సాగుతోందని

మిగతా 2వ పేజీలో..

## టాయ్‌లెట్ పేపర్ కన్నా నీచంగా వాడేసారు

- అనవసర యుద్ధాల్లోకి మమ్మలను లాగారు
- అఫ్ఘాన్ వ్యతిరేక యుద్ధంలో పాల్గొనడంతో తీరని నష్టం
- అమెరికా తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించి పాక్ రక్షణ మంత్రి



**ఇస్లామాబాద్,ఫిబ్రవరి11 (చట్టం న్యూస్):** ఒక దేశానికి ఇంత కంటే అవమానం ఏముంటుందీ.. ప్రతి దానికీ అడుక్కోవటం మొదలైతే ఇంత కన్నా విలువ ఎవరిస్తారు.. పక్క దేశంపై ఏడుపులు, పెడబొబ్బలు.. దాడులు.. కుట్రలు, విధ్వంసంతో నిత్యం హింసతో బతికే దేశానికి ఇంత కంటే గౌరవం ఎవరిస్తారు.. ఇవన్నీ మన పక్కనే ఉన్న పాకిస్తాన్ దేశం గురించే.. పాకిస్తాన్ దేశాన్ని టాయిలెట్ పేపర్ కంటే నీచంగా.. నీచాతి నీచంగా చూస్తున్నారని స్వయానా రక్షణమంత్రి వాపోయారు. స్వయంగా పాక్ పార్లమెంట్‌లో ఏడుస్తూ చెప్పిన మాటలు.. పాకిస్తాన్ దేశం గౌరవం అమెరికా దగ్గర ఎలా ఉంది అంటే.. టాయిలెట్ పేపర్.. టిష్యూ పేపర్ కంటే నీచంగా ఉందంటూ ఆయన మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఆసిఫ్ ఖవాజా ఆ దేశ పార్లమెంట్ సాక్షిగా షాకింగ్ కామెంట్స్ చేశారు. అమెరికా తన సొంత ప్రయోజనాల కోసం పాకిస్తాన్‌ను టాయిలెట్ పేపర్ కంటే దారుణంగా వాడుకుని వదిలేసిందని వాపోయారు. అమెరికాతో సత్సంబంధాలు పాకిస్తాన్‌ను

మిగతా 2వ పేజీలో..

## వైకాపా కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి

- మతాన్ని రాజకీయంగా వాడుకోవాలనే ఎత్తుగడ
- కూటమి నేతలకు పవన్ కళ్యాణ్ హెచ్చరిక



**అమరావతి,ఫిబ్రవరి11(చట్టం న్యూస్) :** వైకాపా కుట్రల పట్ల తెదేపా, జనసేన, భాజపా సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం కమిటీ హాల్‌లో సీఎం చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం అయ్యింది. అసెంబ్లీ కమ్యూనిటీ హాల్లో జరిగిన ఈ సమావేశానికి మూడు పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. వైకాపా విధ్వంస కుట్రలను ఈ సందర్భంగా పవన్ లేవనెత్తారు. మతాన్ని రాజకీయంగా వాడుకోవాలని వైకాపా చూస్తోందన్నారు. సభలో ఎంతసేపు మాట్లాడామనే దానికంటే.. కంటెంట్ ఎంత మాట్లాడామనేదే ముఖ్యమని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. దావోస్‌లో సీఎం, తాను కలిసే ప్రతి సంస్థపై ముందస్తుగా కసరత్తు చేశామని చెప్పారు. 7 నిమిషాల్లో ప్రతి అంశాన్ని సీఎం వివరించి సమావేశాలను ముగించేవారన్నారు. తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామికవేత్తలను సీఎం కలవగలిగారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో సభ్యులు కూడా సభలో ఎక్కువ విషయం చెప్పగలగాలన్నారు. వైసీపీ.. హిందూ మతాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తోందని పవన్ కల్యాణ్ ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఒక్కరూ మతాన్ని గౌరవిస్తారని తెలిపారు. వైసీపీ నేతలు చేసే విధ్వంస కుట్రలను

మిగతా 2వ పేజీలో..

## మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు

- 14న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న మంత్రి కేశవ్
- 15,16. సెలవులు..17, 18వ తేదీల్లో బడ్జెట్‌పై చర్చ
- 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలు
- బిఎసి సమావేశంలో సమావేశాల నిర్వహణపై నిర్ణయం



**అమరావతి,ఫిబ్రవరి11 (చట్టం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 7 వరకు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 14 ఆర్థిక మంత్రి బడ్జెట్ సమర్పిస్తారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్చి 7వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతిరోజూ ఉదయం గం.9:00 నుంచి మధ్యాహ్నం గం.1:30 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈనెల 14న బడ్జెట్ సమావేశం నిర్వహించనుంది. 15, 16న సెలవులు కాబట్టి 17, 18వ తేదీల్లో బడ్జెట్‌పై చర్చ, 18న రాష్ట్ర పద్దుపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరణ ఉంటుంది. 19వ తేదీ నుంచి 8 పనిదినాలు, డిమాండ్ల

మిగతా 2వ పేజీలో..

## గవర్నర్‌కు స్వాగతం పలికిన సిఎం, స్పీకర్



**అమరావతి,ఫిబ్రవరి11 :** ఎపి అసెంబ్లీ సమావేశాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. అసెంబ్లీ వద్దకు చేరుకున్న గవర్నర్ నజీర్‌కు సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వాగతం పలికారు. అసెంబ్లీ సమావేశాలకు మాజీ సీఎం జగన్ సహా వైకాపా సభ్యులు హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగానికి పదేపదే ఆటంకం కలిగిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కాసేపటికే సభ నుంచి జగన్‌తో పాటు ఎమ్మెల్యేలు బయటకు వెళ్లిపోయారు.

## అసెంబ్లీలో జగన్‌ను కలిసిన దువ్వాడ

**తరవాత మాట్లాడుదామిన చెప్పిన వైకాపా నేత**




అమరావతి,ఫిబ్రవరి11 **(చట్టం న్యూస్):** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఏపీ అసెంబ్లీలో వైసీపీ బహిష్కృత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కలిసి మాట్లాడారు. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వైఎస్ జగన్‌కు

మిగతా 2వ పేజీలో..

## 11 వ తేదీ..11మంది..11 నిముషాలు

**వైకాపా హాజరుపై స్పీకర్ ఛలోక్తులు**



**అమరావతి,ఫిబ్రవరి11 (చట్టం న్యూస్):** ఏపీ అసెంబ్లీ లాబీలో మీడియాతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సరదా వ్యాఖ్యలు చేశారు. వైకాపా సభ్యులు గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభకు హాజరై కాసేపు నిరసన తెలిపి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో స్పీకర్ స్పందిస్తూ 11వ తేదీన 11 మంది 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు!.. అంతకుమించి ఎక్కువ సమయం లేరుగా..! అని వ్యాఖ్యానించారు. సభ్యులు సభా సంప్రదాయాలను పాటిస్తే మంచిదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఉదయం 10:00 గంటలకు ప్రారంభమయ్యాయి. సభ ఆరంభమైన కాసేపటికే వైసీపీ సభ్యులు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత

మిగతా 2వ పేజీలో..

## ఓటేసిన పలువురు ప్రముఖులు

**కొడంగ్‌లో ఓటేసిన సిఎం రేవంత్**

**మధిరల ఓటేసిన భట్టి విక్రమార్క**



**హైదరాబాద్,ఫిబ్రవరి11 (చట్టం న్యూస్):** మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీల్లో ఉదయం 7 గంటల నుంచే

మిగతా 2వ పేజీలో..

# మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు

**మొదటి పేజి తరువాయి..**

గ్రాంట్లపై అసెంబ్లీ బీఏసీ చర్చించనుంది ఈ నెల 28న శనివారం నాడు కూడా అసెంబ్లీ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. మార్చి 1, 2, 3వ తేదీల్లో అసెంబ్లీకి సెలవు దినాలుగా నిర్ణయించింది. మార్చి 6, 7న బడ్జెట్‌పై మరోసారి చర్చించనున్నారు. ఆ తర్వాత అవసరం మేరకు అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలా? వద్దా? అనే విషయమై అసెంబ్లీ బీఏసీ నిర్ణయించనుంది. అసెంబ్లీ సమావేశాల్లో రోజూ జీరో అవర్ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. 17 రోజులపాటు అసెంబ్లీ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. 15 ఆదివారం కాగా.. మహా శివరాత్రి తర్వాత రోజు 16న సెలవు ప్రకటించారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. మార్చి 1, 2, 3 తేదీల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. మార్చి 6న అమరావతిలోనే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశాలు జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలు ముగించాలని.. రోజూ జీరో అవర్ నిర్వహించాలని బీఏసీ భేటీలో నిర్ణయించారు. డిమాండ్ ఫర్ గ్రాంట్స్‌పై 8 రోజుల పాటు చర్చ జరగనుంది. ఆరు ఆర్డినెన్స్‌లకు సభ ఆమోదం తెలపనుంది. సమావేశాల సందర్భంగా పలు కీలక చర్చలు, బిల్లుల ఆమోదం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వ విధానాలు, ఆర్థిక ప్రణాళికలపై ప్రతిపక్షం నుంచి తీవ్ర చర్చలు జరిగే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. బ్జడెట్ సమావేశాల మధ్యలో ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సభ్యుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడమే లక్ష్యంగా ఉన్నట్లు సమాచారం. ఈసారి అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా, పరిపాలనా పరంగా కీలకంగా మారనున్నాయి.

# వందేమాతర గీతం ఇక తప్పనిసరి

**మొదటి పేజి తరువాయి..**

పాడుతుండగా.. అంతరాయం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. కొత్త నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలుశిక్ష విధించనున్నారు.

ఇదిలా ఉంటే.. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో దీన్ని భాగం చేశారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వులు వచ్చాయి. అందులో ఆరు చరణాలను పాడాలని కేంద్రం పేర్కొంది. వాటిని 3 నిమిషాల 10 సెకన్లలో ఆలపించాలి. స్వాతంత్య్ర పోరాట సమయంలో ముస్లింలీగ్ అభ్యంతరాల మేరకు.. ఆరు భాగాల్లోంచి ఎలాంటి మతపరమైన ప్రస్తావనా లేని తొలి రెండింటిని మాత్రమే కాంగ్రెస్ స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం వివాదంలేని తొలి రెండు భాగాలతో.. వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది.

# 11 వ తేదీ..11మంది..11 నిముషాలు

**మొదటి పేజి తరువాయి..**

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహా వైసీపీ ఎమ్మెల్యేలంతా 11 నిమిషాల వ్యవధిలోనే అసెంబ్లీ నుంచి బయటకు వెళ్లిపోయారు. తిరుమల లడ్డూ గోవిందా, గోవిందా అంటూ లాబీల్లో నినాదాలు చేశారు. ఈ సమయంలో జై జగన్ అనే నినాదాలని వైసీపీ సభ్యులు చేయగా.. నినాదాలు చేయొద్దని జగన్ వారించినట్లు తెలుస్తోంది. జగన్ చెప్పిన వినకుండా మరింత బిగ్గరగా సభ్యులు అరిచారు. సరిగ్గా 10 గంటలకు అసెంబ్లీలోకి వైసీపీ సభ్యులు వెళ్లి.. కేవలం 11 నిమిషాల పాటు నినాదాలు చేసి వైసీపీ సభ్యులు బయటకు వచ్చారు.

# అసెంబ్లీలో జగన్‌ను కలిసిన దువ్వాడ

**మొదటి పేజి తరువాయి..**

దువ్వాడ ఎదురుపడ్డారు. అసెంబ్లీ నుంచి బయటకు వచ్చే సమయంలో జగన్‌ను దువ్వాడ కలిశారు. దువ్వాడను చూసిన జగన్.. స్నేహపూర్వకంగా 'ఏం చేద్దాం శ్రీనివాస్?' అంటూ పలకరించారు. ధర్మానతో ఉన్న అంశాలపై మాట్లాడాలని దువ్వాడ అభ్యర్థించారు. సమగ్రంగా చర్చించేందుకు తాడేపల్లిలోని తన నివాసానికి రావాలని దువ్వాడను జగన్ ఆహ్వానించారు. వైసీపీ నుంచి సస్పెండ్ చేసినా సమావేశాల సమయంలో అసెంబ్లీకి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వస్తున్నారు. గతంలో ఆయనపై వచ్చిన వివాదాల నేపథ్యంలో ఏడు నెలల క్రితం వైసీపీ నుంచి పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. తాజాగా అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చే సమయంలో వైఎస్ జగన్‌ను దువ్వాడ కలిశారు. ప్రస్తుత పరిణామాలను జగన్‌కు వివరించే ప్రయత్నం చేయగా.. తర్వాత మాట్లాడదాం అంటూ మాజీ సీఎం వెళ్లిపోయారు. మండలిలో ప్రజా సమస్యలపై వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళ్లే ఆలోచనలో దువ్వాడ ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో వైఎస్ జగన్‌ను కలుస్తానని, వైసీపీలో అవకాశం ఇవ్వకుంటే సొంతగా పోటీ చేసి బలం చూపిస్తా అని దువ్వాడ శ్రీనివాస్ చెప్పారు. మీడియాతో దువ్వాడ మాట్లాడుతూ? 'మండలిలో ప్రజా సమస్యలపై ప్రస్తావిస్తా. వైఎస్ జగన్‌ను త్వరలోనే కలుస్తాను. తిరుమల లడ్డూ వ్యవహారంలో భక్తుడి వైపు మాట్లాడతాను. మెడికల్ కాలేజీలని పీపీపీ విధానంలో నిర్మించాల్సిన అవసరం లేదు. జగన్ అవకాశం ఇవ్వకపోతే.. సొంతగా పోటీ చేసి నా బలం చూపిస్తాను' అని చెప్పారు.

# వైకాపా కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి

**మొదటి పేజి తరువాయి..**

సమావేశంలో డిప్యూటీ సీఎం లేవనెత్తారు. మన ప్రభుత్వంపై జగన్ అండ్ కో చేసే కుట్రలపై మూడు పార్టీల సభ్యులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని పవన్ దిశానిర్దేశం చేశారు.

ఏపీ అసెంబ్లీలో సభ్యులు ఎంతసేపు మాట్లాడామనే దానికంటే ఏం మాట్లాడమనేది ముఖ్యమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు పలువురు పారిశ్రామికవేత్తలను కలిశారని ప్రస్తావించారు. ఆయన కలిసే ప్రతీ సంస్థ గురించి ముందస్తు సమాచారం సేకరించి ముఖ్యమైన అంశాల గురించి మాట్లాడేవారని గుర్తుచేశారు. దావోస్ పర్యటనలో పలువురు పారిశ్రామిక వేత్తలతో జరిగిన భేటీలో ఆ సంస్థకు మన ప్రభుత్వ పరంగా కావాల్సినవి ఏమిటి? మనకు ఉన్న వనరులేమిటనే విషయంపై సూటిగా చెప్పి.. ప్రతి సమావేశాన్ని నిమిషాల వ్యవధిలో చంద్రబాబు ముగించారని ప్రస్తావించారు. దీంతో తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామిక వేత్తలను కలిసేందుకు వీలైందని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో సభ్యులు కూడా ముఖ్యమంత్రి స్ఫూర్తితో.. తక్కువ సమయంలో కీలక అంశాల గురించి ప్రస్తావించాలని మంత్రి పయ్యావుల కేశవ్ మార్గనిర్దేశర చేశారు.

# ఓటేసిన పలువురు ప్రముఖులు

**మొదటి పేజి తరువాయి..**

పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో ఓటేశారు. నిజామాబాద్ పట్టణంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ పట్టణంలో ఓటేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకోవాలని బండి సంజయ్ కోరారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి ధర్మపురి అర్వింద్ తదితరులు కూడా తమ ఓటు హక్కను వినియోగించుకున్నరు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.

# స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

**మొదటి పేజి తరువాయి..**



వెల్లడించారు. 19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని పునర్నిర్మించి గాడిలో పెట్టిందన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ సహా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రీస్టార్ట్ అయ్యాయని తెలిపారు. తొలి 9 నెలల కాలంలో దిద్దుబాటు చర్యలు, పాలసీలు, వ్యవస్థల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసి పారదర్శకమైన పాలనను కూటమి ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో పాలన సాగిస్తోందన్నారు. పది సూత్రాలను నిర్దేశించుకుని.. ప్రజలకు సుపరిపాలన అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతూకంగా చేసుకుని ప్రభుత్వ పాలన సాగుతోందని అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. జీరో పావర్టీ లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని గవర్నర్ వెల్లడించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతీ కుటుంబానికి అవసరమైన ప్రయోజనాలను అందిస్తున్నామన్నారు. త్వరలో ఫ్యామిలీ కార్డును అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. పీ4 ద్వారా పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యాలను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎవరూ ఆకలితో ఉండకూడదనే సూత్రంతో 113 నియోజకవర్గాల్లో 205 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని చెప్పారు. త్వరలో మిగిలిన నియోజకవర్గాల్లోనూ గ్రామీణ అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని గవర్నర్ నజీర్ వెల్లడించారు. అందరికీ ఇల్లు.. అనే లక్ష్యంతో గృహ నిర్మాణ పథకాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు గవర్నర్. ఎస్సీ వర్గీకరణ ద్వారా అన్ని వర్గాలకూ న్యాయం జరిగేలా చేసిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం.. వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా బీసీ వర్గాలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ చేపట్టిందన్నారు. మైనారిటీలకు భద్రత, వారికి అభివృద్ధిలో భాగస్వామ్యం, విద్య, ఆర్థిక సహకారంతో మేలు చేకూరుస్తోందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు.రాష్ట్రం ఐటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లాంటి రంగాల్లో దూసుకెళ్తోందని గవర్నర్ పేర్కొన్నారు. ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యంతో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తోందన్నారు. అంతర్జాతీయ సంస్థలు.. ఏపీని పెట్టుబడులు, నాలెడ్జ్ ఎకానమీకి గమ్యస్థానంగా ఎంచుకున్నాయని తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవటం ద్వారా యువతకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని గవర్నర్ వివరించారు. ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గించేలా.. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య భద్రతను బలోపేతం చేస్తోందన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి రూ.2.5 లక్షల వరకూ సమగ్ర ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెస్తోందన్నారు. 1.43 కోట్ల పేద కుటుంబాలకు రూ.25 లక్షల వరకు నగదురహిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తోందని అన్నారు. క్యాన్సర్ సహా ఇతర ఖరీదైన చికిత్సలకు ఎలాంటి పరిమితి లేకుండా ప్రభుత్వం ఈ బృహత్ పథకాన్ని చేపడుతోందని చెప్పారు గవర్నర్. వృద్ధుల సంఖ్య పెరగడం వివిధ దేశాలకు సవాల్‌గా మారిందని.. దీనిపై సరైన విధానాన్ని రూపొందించాలని సభను కోరుతున్నట్లు గవర్నర్ తెలిపారు. అక్రమ మద్యం తయారీ నుంచి విముక్తి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని.. గంజాయి నిర్మూలనలో పురోగతి సాధించిందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. 'వీబీ జీ రామ్ జీ' పథకం ద్వారా ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచారన్నారు. అభివృద్ధి వ్యూహంలో మహిళలే కేంద్ర బిందువులని.. ఆర్థిక భాగస్వాములు, స్వయం పేరుతో డ్వాక్రా మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు బ్రాండింగ్ చేస్తోందన్నారు. ఏడాదికి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని.. వచ్చే ఏడాది 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుందని తెలిపారు. అంగన్ వాడీలను బలోపేతం చేసి.. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి ద్వారా మహిళలకు న్యాయ సహకారం కూడా అందిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

# టాయ్‌లెట్ పేపర్ కన్నా నీచంగా వాడేసారు

**మొదటి పేజి తరువాయి..**

బలహీనపరిచి అస్థిరంగా మార్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. 1999 తర్వాత అమెరికాతో కలిసి పనిచేయాలని పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయం దేశానికి తీవ్ర నష్టాన్ని కలిగించిందని అన్నారు. పాకిస్తాన్ ఎప్పుడూ తమకు సంబంధం లేని యుద్ధాల్లోకి లాగబడిందని ఆయన బహిరంగంగా అంగీకరించారు. అమెరికా తన రాజకీయ ప్రాధాన్యాలు, అవసరాలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని వాడుకొందని అన్నారు. తర్వాత తమను టాయిలెట్ పేపర్ కంటే ఘోరంగా తీసిపారేసిందన్నారు. అఫ్గానిస్థాన్ విషయంలో 1999 తర్వాత అమెరికాతో చేతులు కలపడం తాము చేసిన పెద్ద తప్పిదమని అన్నారు. దీనివల్ల దేశం చాలా నష్టపోయిందని.. దాని పర్యవసానాలను ఇప్పటికీ అనుభవిస్తోందని వాపోయారు. 1999లో అప్పటి పాక్ సైన్యాధిపతి జనరల్ పర్వేజ్ ముషారఫ్ నేతృత్వంలోని సైన్యం.. ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూల్చేసి అధికారాన్ని చేజిక్కించు కుందని ఆసిఫ్ ఖవాజా అన్నారు. 2001 తర్వాత అమెరికా మద్దతుతో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తాలిబన్లకు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. అయితే, తాలిబన్లు తిరిగి తమపై హింసకు పాల్పడ్డారన్నారు. తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు అగ్రరాజ్యం తమకు ఎటువంటి సహాయం చేయలేదని ఆరోపించారు.ఆఫ్ఘాన్‌పై అమెరికా చేసిన యుద్ధానికి పాక్ మద్దతు ఇవ్వడం ద్వారా తాలిబన్లకు పాకిస్తాన్ వ్యతిరేకంగా మారిందని ఒప్పుకున్నారు. అమెరికా చివరికి ఈ ప్రాంతం నుండి వైదొలగడంతో పాకిస్తాన్ దీర్ఘకాలిక హింస, తీవ్రవాదం, ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోందని అన్నారు. అమెరికాను సంతృప్తి పరచడానికే పాక్ మాజీ సైనిక పాలకులు జియా-ఉల్-హక్, పర్వేజ్ ముషారఫ్ ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంలో చేరారని పేర్కొన్నారు. మనం ఎదుర్కొన్న నష్టాలను ఎప్పటికీ భర్తీ చేయలేమని.. పాకిస్తాన్ చేసిన తప్పులను తిరిగి మార్చలేనివి అని అన్నారు. ఇటీవల అమెరికాతో పాక్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతోంది. ఈ క్రమంలో అమెరికాకు వ్యతిరేకంగా పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ ఖవాజా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

# జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో కలిపి మొత్తం పోలింగ్ 77.70 శాతం నమోదు
- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 11,( చట్టం బ్యూరో) :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా పోలింగ్ 77.70 శాతం నమోదు అయిందని పేర్కొన్నారు.

**పోలింగ్ శాతం..**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 39,942 మంది పురుషులు, 42,011 మంది మహిళా ఓటర్లు, 06 ఇతర ఓటర్లు ఉండగా, 30, 466 పురుషులు, 33,091 మహిళలు, ఇతరులు 05 మొత్తం 63,562 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.55 పోలింగ్ శాతం నమోదు అయింది. అలాగే వేములవాడ మున్సిపల్ పరిధిలో 19,580 మంది పురుషులు, 21,279 మంది మహిళా ఓటర్లు, 18 ఇతర ఓటర్లు ఉండగా, 14,801 పురుషులు, 17,070 మహిళలు, ఇతరులు 10 మంది మొత్తం 31,881 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. పోలింగ్ శాతం 77.99 నమోదు అయింది. జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో కలిపి 1,22,836 మంది ఓటర్లు ఉండగా, 95,443 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా మొత్తం పోలింగ్ శాతం 77.70 నమోదు అయింది. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన కుసుమ రామయ్య ఉన్నత పాఠశాల అలాగే సిరిసిల్ల గీతా నగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మున్సిపల్ పరిధిలోని ఇప్పలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్ ను, ఓటింగ్ సరళిని సందర్శించి.. అధికారులతో మాట్లాడారు. అనంతరం వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో .. అలాగే 20 వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో పరిశీలించారు. వేములవాడ లోని సినారె కళామందిరంలో రిసెప్షన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గాంధీ నగర్ లోని గ్రీన్ పోలింగ్ కేంద్రంలో పరిశీలించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్ ,తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్, టీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో విజేతలుగా వోవెల్స్ విద్యార్థులు



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 11,( చట్టం బ్యూరో) :** విశ్వం ఎడ్యుటెక్ సంస్థ ఫిబ్రవరి 8 న హైదరాబాద్, కూకట్ పల్లి లోని పిఎన్ఎమ్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలను ఘనంగా నిర్వహించింది. ఈ పోటీలలో కరీంనగర్ స్థానిక విద్యానగర్ లోని వోవెల్స్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 500 పాఠశాలలకు చెందిన 1,000 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో వోవెల్స్ స్కూల్ విద్యార్థులు జె. రితిక్ రెడ్డి, సీనియర్ లెవెల్ – 5 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా, సీనియర్ లెవెల్ – 4 విభాగంలో కె. అనూహ్య రెడ్డి రైసింగ్ స్టార్ బహుమతి మరియు జూనియర్ విసువలైసెషన్ లో జి. సాత్విక్ రెడ్డి జీనియస్ బహుమతి గెలుచుకున్నారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు విశ్వం ఎడ్యుటెక్ సంస్థ ప్రతినిధులు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో వోవెల్స్ స్కూల్ కరెస్పాండెంట్ జె. తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ మమత, అబాకస్ శిక్షకులు స్రవంతి, నాగరాజు, స్వాతి, మాధురి పాల్గొన్నారు.



# మాదిగ శక్తి సదస్సులు జయప్రదం చేయండి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 11,( చట్టం బ్యూరో) :** కరీంనగర్ పట్టణంలో మంగళవారం రోజున మాదిగ మహాశక్తి సదస్సు సభ్యులు పత్రిక సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 14 శనివారం రోజున స్థానిక ప్రతిమ మల్టీపెక్స్ కాన్ఫిరెన్స్ హాల్ లో కరీంనగర్ లో జరుగబోయే "మాదిగ మహా శక్తి సదస్సు" ను విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాజీ మంత్రి వర్యులు మోత్కుపల్లి నర్సింహులు మానకొండూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ ఎస్సి సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్య నారాయణ పాల్గొంటున్నారు అని తెలిపారు. మాదిగ యువకులు మేధావులు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్‌లు బండ శ్రీనివాస్, అరెపెల్లి రాజేందర్, నాగేలి దేవేందర్, అసంపల్లి నాగరాజు, గజ్జెల స్వామి. లు పాల్గొన్నారు.



# ఖమ్మం జిల్లాలో అధికార దుర్వినియోగం –– 'ఓటు చోరీ'

**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) ఫిబ్రవరి 11 :** ఆరోపణల అసలు ముఖం బహిర్గతం మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా ఖమ్మం జిల్లా పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియను పరిశీలించామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు తెలిపారు. పోలింగ్ సరళి, ఓటర్ల హాజరు, ఎన్నికల నిర్వహణలో చోటుచేసుకుంటున్న అనుమానాస్పద పరిణామాలపై అభ్యర్థులతో కలిసి సమగ్రంగా వివరాలు సేకరించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ 'ఓటు చోరీ' అంటూ బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ విషప్రచారం నిర్వహించారు. కానీ ఖమ్మం జిల్లాలో జరుగుతున్న పరిణామాలు చూస్తే, అసలు ఓటు చోరీకి పాల్పడుతున్నవారు ఎవరో ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోంది" అని అన్నారు.ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు ప్రభుత్వ




ఉద్యోగులతో నిర్వహించిన కాన్ఫరెన్స్ కాల్‌కు సంబంధించిన ఆడియో వెలుగులోకి రావడం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హెచ్చరిక అని పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నికల డ్యూటీలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ప్రభావితం చేయడం జరిగి ఉంటే, అది కేవలం నైతిక తప్పిదం కాదు --- అది ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచే ప్రమాదకర చర్య అని విమర్శించారు.

ప్రభుత్వ జీతం తీసుకుంటూ, ఎన్నికల బాధ్యతలు నిర్వర్తించాల్సిన ఉద్యోగులు ఒక పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తే, అది రాజ్యాంగబద్ధ బాధ్యతల పట్ల స్పష్టమైన ద్రోహమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవస్థను పార్టీ ప్రయోజనాల కోసం ఉపయోగించడం 'ఓటు చోరీ' కాదా? అని ప్రశ్నించారు. దేశమంతా బీజేపీపై వేలెత్తిన కాంగ్రెస్ బుధవారం ఖమ్మం జిల్లాలో జరుగుతున్న అధికార దుర్వినియోగంపై ఏమి చెబుతారు? మంత్రి స్థాయిలోనే ఎన్నికల ప్రక్రియలో జోక్యం జరిగితే, సాధారణ ప్రజల ఓటు స్వేచ్ఛ ఎక్కడ నిలుస్తుంది?" అని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తమ అధికారాన్ని ఉపయోగించి ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసినందుకు వెంటనే ఆయనపై స్వతంత్ర దర్యాప్తు ఆదేశించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల విధుల్లో పక్షపాతంగా వ్యవహరించిన ప్రభుత్వ ఉద్యోగులపై తక్షణ సస్పెన్షన్, విభాగీయ విచారణ ప్రారంభించాలని, ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్యం మీద దాడి చేస్తే బీజేపీ మౌనం వహించదు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు అవసరమైతే చట్టపరమైన మరియు ప్రజాస్వామ్యపరమైన పోరాటం చేస్తాము" అని దేవకి వాసుదేవరావు స్పష్టం చేశారు.

# ఆకు మడత తెగులు నుండి వారిని కాపాడుకోండి

**నరశింగపాలెం, చొప్పరమెట్ల గ్రామాలలో పొలంపిలుస్తోంది.**

**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఫిబ్రవరి 11 చట్టం ప్రతినిధి :** నరశింగపాలెం, చొప్పరమెట్ల , గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమము లలో మండల వ్యవసాయాధికారి జీ. భవాని గారు మాట్లాడుతూ రైతులందరూ రబీ వరి సాగులో పురుగులు తెగుళ్లతో అప్రమత్తముగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేసారు.

మండల వ్యవసాయాధికారి వరి పొలములను సందర్శించి రైతులకు పలు సూచనలు అందించారు. వరి లో ఆకు ముడత పురుగు ఆశిస్తుంది అని దాని నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఆకుముడతను కలుగచేసే గొంగళి పురుగు ఆకు ముడత లో ఉండి పత్రహరితాన్ని గోకి తినివేయడం వలన ఆకులు తెల్లబడతాయని అందువలన పోటాకు దశలో నష్టం ఎక్కువ కలుగ చేస్తుంది అని తెలియచేసారు. ఆకు ముడత పురుగు నివారణకు పిలక దశలో క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి 2.5 మి.లీ. లేక ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి 2.0 మి.లీ.లేదా మోనోక్రోటోఫాస్ 36 ఎస్.ఎల్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి 2.0 గ్రా. లేక ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరాంట్రినిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకొని ఆకుముడత తెగులు నుండి వరి పంటను కాపాడుకోవాలని తెలియచేసారు



ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జీ. భవాని గారు రైతు సేవా కేంద్రం (శాఖ) సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# జాతీయ సదస్సులో పాల్గొననున్న పరిశోధకుడు మహమ్మద్ లాల్ సాహెబ్ ...

- **పరిశోధన అంశంపై పేపర్ ప్రజెంటేషన్ చేయనున్న లాల్ సాహెబ్..**
- **మహమ్మద్ లాల్ సాహెబ్ ను ప్రశంసించిన పలువురు మేధావులు.**

**మహబూబాబాద్ జిల్లా తొర్రూర్, ఫిబ్రవరి 11(చట్టం న్యూస్) :** కాకతీయ విశ్వవిద్యాలయం లో ఫిజికల్ ఎడ్యుకేషన్ పరిశోధకుడికి అరుదైన అవకాశం లభించడం అదృష్టం గా భావించాలని పలువురు మేధావులు అన్నారు. తొర్రూర్ మండలం, చీకటయపాలెం గ్రామము నుండి మధ్యతరగతి కుటుంబానికి చెందిన మహమ్మద్ అలిసాహెబ్



షబీన దంపతుల కుమారుడు మహమ్మద్ లాల్ సాహెబ్ అంతర్జాతీయ స్థాయిలో మరో గొప్ప గౌరవం దక్కింది .ఈ నెల 11 నుంచి 14 వరకు గోవా లోని రోసరీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్. నావెలిం గోవా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ లో జరుగనున్న ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సులో పాల్గొనామాని ఆహ్వానం అందుకున్నారు. ఈ సదస్సులో ఆయన ఎఫెక్ట్ ఆఫ్ ప్లేయమెట్రిక్ ట్రైనింగ్ అండ్ ఇంటర్వెల్ ట్రైనింగ్ ఆన్ సెలెక్టెడ్ మోటార్ ఫిట్నెస్ అండ్ పిజిసియోలాజికల్ కాంపోనెట్స్ అమింగ్ వాలీబాల్ ప్లేయర్స్ అనే అంశంపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. మహమ్మద్ లాల్ సాహెబ్ కాకతీయ విశ్వవిద్యాలయం లో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం మహమ్మద్ లాల్ సాహెబ్ కాకతీయ విశ్వవిద్యాలయం లో కిట్స్ వరంగల్ ప్రొఫెసర్ డా,,. పి.రమేష్ రెడ్డి పర్యవేక్షణ లో పరిశోధన కొనసాగిస్తున్నారు. స్థానిక స్థాయి నుండి జాతీయ, అంతర్జాతీయ స్థాయి కి ఎదుగుతున్న మహమ్మద్ లాల్ సాహెబ్ ప్రతిభ పై కాకతీయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు, స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు గర్వపడుతున్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థి కాలర్ పట్టిన సీఐ శివకుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీలో పోలీసులకు, జగ్గారెడ్డి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. 34వ వార్డులో ఆ వార్డు అభ్యర్థి అడ్డును సీఐ కాలర్ పట్టుకోవడంతో గొడవ మొదలైంది.

**సంగారెడ్డి జిల్లా బ్యూరో చట్టం న్యూస్:** సంగారెడ్డి మున్సిపాలిటీలో పోలీసులకు, జగ్గారెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. 34వ వార్డులో ఆ వార్డు అభ్యర్థి అడ్డుకుని సీఐ కాలర్ పట్టుకోవడంతో గొడవ మొదలైంది. కాంగ్రెస్ శ్రేణులు సీఐ తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి పోలింగ్ సెంటర్ వద్దకు చేరుకుని పోలింగ్ ఆపేస్తానంటూ బూత్ లోకి వెళ్లడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పోలీసులతో జగ్గారెడ్డి



మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు జగ్గారెడ్డికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

**నేనో మీరో తేలిపోవాలి**

ఈ సందర్భంగా జగ్గారెడ్డి పోలీసులపై ఘాటు వ్యాఖ్యలతో రెచ్చిపోయారు. రిగ్గింగ్ చేస్తున్నారని చెప్పిన మా అభ్యర్థిపై సీఐ శివకుమార్ గల్లా పట్టాడని ఆ సీఐ మొగోడు అయితే ఇక్కడికి రావాలని మండిపడ్డారు. సంగారెడ్డిలో ఇవాళ లా అండ్ ఆర్డర్ సమస్య వస్తే దానికి సీఐ, హోంగార్డే కారణం అని.. ఏమనుకుంటున్నార్రా మీరు హోం గార్డులు? మొగోణ్ణి నేనో పోలీసులో ఈరోజు తేలిపోవాలంటూ పోలీసులపై రెచ్చిపోయారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# ఘనంగా దీన్ దయాళ్ వర్ధంతి

**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఫిబ్రవరి 11 చట్టం ప్రతినిధి:** ఆగిరిపల్లి గ్రామంలో, ఆగిరిపల్లి మండల భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు సమావేశమై పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి 58వ వర్ధంతిని జరుపుకొని వారికి వినమరంగా నివాళులు అర్పించడం జరిగినది. దేశానికి మానవాళికి ఆయన సూచించిన చేసిన సేవలను ప్రస్తుతించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శ్రీ సంగ రంగారావుగారు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీ జి ఆర్ కె రంగారావు గారు, నరసింగపాలెం సొసైటీ చైర్మన్ శ్రీ పొన్నం వెంకట రామచంద్ర రావు గారు, మండల భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శులు శ్రీ జలసూత్రం శేషగిరిరావు గారు- మెమొగదాటి వెంకటేశ్వరరావు గారు, మండల భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు శ్రీ రెడ్డి రామారావు గారు, ఆగిరిపల్లి మండల భారతీయ జనతా పార్టీ కార్యదర్శి శ్రీ కలపాల రాంబాబు గారు మరియు ఆగిరిపల్లి మండల భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు శ్రీ సంగా ధీనరాజు గారు పాల్గొనడం జరిగినది. కొద్దికాలం క్రితము చనిపోయిన మళ్లీ బోయినపల్లి గ్రామ కాపరస్తులు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, హిందూ ధర్మపరాయినుడైన దళిత నాయకుడు శ్రీ దప్పుల నాగేశ్వరరావు గారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ... వారికి జోహార్లు పలకడం జరిగింది.

-----------



# రికార్డు అసిస్టెంట్ మరియు ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ రెగ్యులర్ ఉద్యోగ పోస్ట్‌ల కొరకు నోటిఫికేషన్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్నూలు నందు రికార్డు అసిస్టెంట్ మరియు ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ రెగ్యులర్ ఉద్యోగ పోస్ట్‌ల కొరకు ఇచ్చిన నోటిఫికేషన్ నెంబర్. 1/2026, 3/2026 ప్రకారం ఈ నెల 18 వ తారీఖున నిర్వహించే వ్రాత పరీక్షకు అర్హత గల అభ్యర్థులు మరియు అనర్హత కలిగిన అభ్యర్థుల లిస్టులను డిస్టిక్ కోర్టు వెబ్సైట్ www.ecourtskurnool.com మరియు https://kurnool.dcourts.gov.in నందు పొందుపరచడమైనది.అభ్యర్థులు ఈ వెబ్సైట్ నందు తమ పేర్లను చూసుకొని ఈ నెల 18న ఉదయం 9-00 గంటలకు శ్రీ ప్రసున లా కాలేజీ, కర్నూలు నందు జరగబోయే వ్రాత పరీక్షకు హాజరు కావాల్సిందిగా అర్హత గల అభ్యర్థులను కోరడమైనది. అర్హత గల అభ్యర్థులకు హాల్ టికెట్లు వారు ఇచ్చిన అడ్రస్ కు పోస్టు నందు రాలేకపోయినచో వారు జిల్లా న్యాయ సేవా సదన్ కర్నూలు నందుగల హెల్ప్ డెస్క్ ను 17వ తారీఖున సంప్రదించవలసినదిగా కోరడమైనది. కావున అర్హత గల అభ్యర్థులకు అందరికీ తెలియజేయడ మేమనగా నియామక ప్రక్రియ మొత్తము రాత పరీక్ష,నైపుణ్య పరీక్ష మరియు ఇంటర్వ్యూల ద్వారా పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా మరియు మెరిట్ ఆధారంగా మాత్రమే నిర్వహించబడును.అభ్యర్థులు ఎవరిని నమ్మి ప్రలోభాలకు లోను కావద్దని విజ్ఞప్తి చేయడమైనది. జి. కబర్థి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు చైర్మన్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు, మరియు బి.లీలా వెంకట శేషాద్రి, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కర్నూలు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి : ఖాదర్ వలీ ఖాన్



**నార్పల ఫిబ్రవరి 11, (చట్టం) న్యూస్ :** నార్పల మండల కేంద్రంలో సచివాలయం, 3, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా, గాండ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా, రాఘవేంద్ర, ఎన్నుకోవడం జరిగింది , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఖాదర్ వలీ ఖాన్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నిక కాబడిన అధ్యక్షులు కార్యదర్శులు ప్రతి ఇంటికి తిరిగి2019, వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ప్రవేశపెట్టి లబ్ధి చేకూర్చిన పథకాలను తెలియజేయాలి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోసం జగనన్న సైనికులుగా మనమంతా కష్టపడి 2029లో మళ్లీ తిరిగి మన వైయస్ జగన్మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రి చేసుకోవాలి అదే విధంగా సింగనమల శాసనసభ్యులుగా సాకే శైలజనాథ్ అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని తెలియజేశారు కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్,అబ్జర్వ్ వెంకటనారాయణ రెడ్డి, బాల నాగి బయన్న, దాడి తోట భాష, తలారి రమేష్ యూత్ వింగ్ శ్యాంసుందర్ గోపాల్ రెడ్డి బాలనాగి రామాంజనేయులు శివలక్ష్మి పూజారి నల్లప్ప వేదాంతం మోహన్ ముత్యాలు మీరామోదిన్ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ కార్యాలయాలలో ఆకస్మిక తనిఖీలు చేసిన ఆర్.టి.ఐ కమిషనర్





**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) ఫిబ్రవరి 11:** సమాచార హక్కు చట్టం ఆర్.టి.ఐ అమలు తీరును పరిశీలించేందుకు రాష్ట్ర కమిషనర్ పి వి శ్రీనివాస్ రావు ఖమ్మం ప్రభుత్వ కార్యాలయాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎన్ ఎస్ పి క్యాంపు లో ఉన్న సర్కిల్ త్రీ ఇరిగేషన్ కార్యాలయం, పాత బస్సు స్టాండ్ సమీపం లోని ఖమ్మం ఆర్ డి ఓ కార్యాలయాలలో తనిఖీలు నిర్వహించి ఆర్ టి ఐ రికార్డు లను పరిశీలించారు..ఇరిగేషన్ కార్యాలయాలయంలో ఆర్టిఐ చట్టం ప్రకారం 4(1) బి కింద పదిహేడు అంశాలతో కూడిన సిటిజెన్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడం పై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు..ఆర్ టి ఐ చట్టం ప్రకారం క్రింద రికార్డు లను సరిగ్గా నిర్వహించకపోవడం పై ఆసంతృప్తి వ్యక్తం చేశారు.. ఆర్ డి ఓ కార్యాలయం లో ఆర్ టి ఓ రికార్డులను పరిశీలించారు. 4(1) బి ప్రకారం పదిహేడు అంశాల తో కూడిన సిటిజెన్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న పిసిసి చీఫ్

నిజామాబాద్,ఫిబ్రవరి11 : పట్టణంలోని సన్ ఫ్లవర్ హైస్కూల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం ఓటు అని, ఓటింగ్ శాతం పెరిగినప్పుడే సమాజానికి మేలు చేసే నాణ్యమైన నాయకులు వస్తారని పేర్కొన్నారు. నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తూనే, బీజేపీ మతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని విమర్శించారు. అభివృద్ధికి పట్టం కట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# స్పీకర్ సమవర్తిగా ఉండాల్సిందే !

స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్డిఎ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరా÷– జాకఢ్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలను ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసుకోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది సుస్పష్టం. ఇకపోతే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవేళ రాహుల్ విపక్ష నేతగా సరిగా మాట్లాడకపోతే దానికి సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుంది. కానీ అసలు మైక్ ఇచ్చీ ఇవ్వనట్లుగా స్పీకర్ వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. ఇది కూడా మంచిదే. ఎలాగూ బలం ఉంది. స్పీకర పదవికి వచ్చిన ఢోకా లేదు. కనీసంఈ సందర్భంగా అయినా పార్లమెంట్‌లో చర్చ సాగితే మంచిదే. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు మంగళవారంనాడు నోటీసులు ఇచ్చారు. నోటీసును లోక్‌సభ సెక్రటరీకి అందజేశారు. ఇండియా కూటమికి చెందిన 118 మంది ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేశారు. సభలో మాట్లాడేందుకు విపక్ష నేతలకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదంటూ ఈ నోటీసు ఇచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, డీఎంకే పార్టీలు దీనికి మద్దతు పలుకగా, తృణమూల్ కాంగ్రెస్ ఇంతవరకూ సంతకం చేయలేదు. ఈ ప్రక్రియను సమీక్షించనున్నట్టు టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై రాహుల్ గాంధీ సంతకం చేయలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ తొలగింపు పిటిషన్‌పై ప్రతిపక్ష నేత సంతకం చేయడం సరైంది కాదని, రాహుల్ గాంధీ సంతకం చేయకపోవడానికి అదే కారణమని పేర్కొన్నాయి. కాగా, అవిశ్వాస తీర్మానం పరంగా లోక్‌సభలో బలాబలాలను చూసినప్పుడు లోక్‌సభలో అధికార పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. 293 మందితో మెజారిటీ సభ్యుల బలం వారికి ఉండగా, విపక్షాలకు 214 మంది సభ్యుల బలం ఉంది. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా తెలుస్తుంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్యలు ఉన్నాయి. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాలను చర్చకు అవకాశం ఉంటుంది. కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. మాజీ ఆర్మీచీఫ్ నరవాణె అముద్రిత పుస్తకంలోంచి కొన్ని పదాలను ఉటంకిస్తూ రాహుల్ మాట్లాడాలనుకున్న అవకాశం దక్కలేదు. ఒకవేళ అముద్రిత పుస్తకం ప్రస్తావన వద్దని చెప్పడం వేరు. కానీ అసలు మాట్లాడనీయక పోవడం సరికాదు. వాజ్‌పేయ్, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. ఇకపోతే అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని ఓంబిర్లా నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌ను తొలగించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలపై సస్పెన్స్ వేటువేశారని విపక్షాలు తప్పుపడు తున్నాయి. విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం, మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశాయి. కాగా, దీనికిముందు అధికార పార్టీకి తలొగ్గి తమపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ ఓం బిర్లాకు రాసిన లేఖలో కాంగ్రెస్ మహిళా ఎంపీలు నిరసన తెలిపారు. ఇవన్నీ ఎలా ఉన్నా పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి. గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు ఎన్డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి. ఇంకా మభ్య పెట్టే పనులతో ప్రజల్లో మరింత పలచన కాకుండా చూసుకుంటే మంచిది.

## ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో కుచ్చుటోపీ

- 500 మంది నుంచి 270 కోట్లు వసూళ్లు
- ఎనిమిదేళ్లయినా అతీగతీ లేని ప్రాజెక్టు
- ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు

హైదరాబాద్,ఫిబ్రవరి11 : ఊదరగొట్టే ప్రకటనలు ఇస్తారు. అతి తక్కువ ధరకే ప్లాట్స్ ఇస్తామంటూ ఊరిస్తారు. తీరా చూస్తే.. డబ్బులు కట్టించుకుని ఏళ్లకు ఏళ్లు.. వారి చుట్టూ తిప్పించుకుంటారు. డబ్బులు చేతిలో పడ్డాక.. ఉసూరమనిపిస్తారు. అంతా రియల్ మాయాజాలం. ఆ రియల్ మాయకు అమాయకులైన జనం మోసపోతున్నారు. హైదరాబాద్‌లో ఇలాంటి రియల్ మోసాలు చాలా జరుగుతున్నాయి. తాజాగా అలాంటి చీటింగ్ గ్యాంగ్ ఒకటి వెలుగులోకి వచ్చింది. కూకట్‌పల్లిలో వైట్ వాటర్ పేరుతో ప్లాట్స్ అమ్ముతున్నామని ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో మోసం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు 500 మంది నుంచి 270 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. పదేళ్ల నుంచి ప్రాజెక్టు పేరు చెప్పి డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వైట్ వాటర్ కన్‌స్ట్రక్షన్ యజమాని అజయ్‌తో పాటు పలువురుపై కేసుల నమోదు చేసి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ కేసు మూసాపేట పవర్ నగర్ కాలనీకి చెందిన భోగాడి సుజాత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేశారు పోలీసులు. ఐతే ఈ కేసులో ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదు. వైట్ వాటర్స్ యాజమాన్యానికి ఎ÷–లాట్ కొనుగోలు కోసం ఫిర్యాదుదారు సుజాత సుమారు 80 లక్షల రూపాయలు చెల్లించారు. కానీ ఆమె తీసుకున్న ఎ÷–లాట్‌ను బ్యాంకులో తనఖా పెట్టినట్లు ఆమెకు తెలిసింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మరోవైపు వైట్ వాటర్స్ యాజమాన్యం.. ఎ÷–లాట్ల కొనుగోలుదారులకు ఎ÷–లాట్లను స్వాధీనం చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. ఇప్పటికే డబ్బు చెల్లించి పదేళ్లు గడిచిపోయిందని బాధితులు చెబుతున్నారు. పైగా ధరలు పెంచడం, ఒకే ప్లాట్‌ను పలుమార్లు అమ్మారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో వైట్ వాటర్స్ యాజమాన్యంపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిజానికి ఈ వైట్ వాటర్స్ ప్రాజెక్టు వెంచర్‌ను 2018లో ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు కేవలం టవర్స్‌లో నిర్మాణం కొంతమేర పూర్తయింది. అ, ఆ టవర్ల బేస్‌మెంట్లు మాత్రమే పూర్తి చేశారు. ఇ, ఈ టవర్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. నమోదు గడువు ఇప్పటికే రెండుసార్లు పొడిగించగా.. ఈ ఏడాది జూన్‌లో అది కూడా ముగియనుందని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. గతంలో డిసెంబర్ 2024, డిసెంబర్ 2025లో ఎ÷–లాట్లు హ్యాండ్ ఓవర్ చేస్తామని చెప్పి మోసం చేసినట్లు బాధితులు చెబుతున్నారు. వైట్ వాటర్స్ యజమాని అజయ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుకున్నారు. ముందస్తుగా డబ్బులు చెల్లిస్తే అతి తక్కువ ధరకే ఎ÷–లాట్ ఇస్తామంటూ అందరిని నమ్మించాడు అజయ్. దీంతో ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో వచ్చిన దీనిని ఆకర్షితులై చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఇప్పటివరకు 270 కోట్ల రూపాయలకు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇక్షచి పోలీసులకి ఇప్పటివరకు వందమంది కాంటాక్ట్ అయ్యారు. మరోవైపు పోలీస్ కేసు నుంచి తప్పించుకునేందుకు అజయ్ కొత్త నాటకానికి తెర తీసినట్టు బాధితులు చెబుతున్నారు. తమకు డబ్బులు ఇస్తామని చెప్పి నమ్మించి.. కొందరి చేత కేసులు విత్ డ్రా చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

# "త్రివేణి"లో ఎస్ ఎఫ్ ఐ టాలెంట్ టెస్ట్ పేపర్ ఆవిష్కరణ






**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) ఫిబ్రవరి 11:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగర కేంద్రంలో త్రివేణి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేపర్ ఆవిష్కరణ జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కిమ్స్ హాస్పిటల్, వైద్యురాలు యార్లగడ్డ రజిత మరియు త్రివేణి పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ పేపర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి రజిత మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యార్థులకు పరీక్షల పైన ఉన్న భయాన్ని పోగొట్టడం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయం అని



తెలియజేశారు అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులు ఈ అధునాతన కాలంలో పోటీ ప్రపంచానికి అనుగుణంగా తమ తెలివితేటలు పెంచుకోవాలని విజ్ఞానవంతులుగా మేధావులుగా తయారవ్వాలని తెలిపారు. జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడటమే కాకుండా విద్యార్థులను మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధులుగా చేయడం కోసం ఈ టాలెంట్ టెస్ట్ పట్టణ మరియు మండల స్థాయి లలో నిర్వహించడం జరుగుతోంది.. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ టాలెంట్ టెస్ట్ పిల్లలకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని , ఎగ్జామ్స్ పట్ల వారికున్న భయాన్ని పోగొట్టుకోవడానికి, అలాగే వారి యొక్క సృజనాత్మకతను పరీక్షించుకోవడానికి ఇట్లాంటి టాలెంట్ టెస్టులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని విద్యార్థిని విద్యార్థులు అంతా ఈ చక్కని అవకాశాన్ని వినియోగించుకోవాలని, అలాగే గత 40 సంవత్సరాలుగా ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మరియు జిల్లా కమిటీ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ పేపర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంగీత, జిల్లా సహాయ కార్యదర్శి సాత్విక, జిల్లా కమిటీ సభ్యురాలు సింధు, అలాగే జిల్లా కమిటీ సభ్యులు శ్రీనాథ్ ,లోకేష్ ,రమణ, లోహిత్ కుమార్, సాయి గోపి, హారిక ,అశోక్, భరత్ పాల్గొన్నారు.

# కుంచాల శ్రీనివాస్ రావు భౌతికకాయాన్ని సందర్శించిన వడ్డెబోయిన



**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) ఫిబ్రవరి 11 :** 25వ డివిజన్ కాంగ్రెస్ ప్రముఖులు బూత్ లెవెల్ ఏజెంట్ అయిన కుంచాల నరేష్ తండ్రి అయిన కుంచాల శ్రీనివాస్ ఆకస్మికంగా మరణించడం పట్ల 25 వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు డివిజన్ మాజీ కార్పొరేటర్ కుమ్మరి బజార్ లోని వారి నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి వారికుటుంబానికి సంతపాన్ని సానుభూతిని తెలిపారు అని తెలియజేయుచున్నాము ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ ఎప్పుడూ ఎన్నికలు వచ్చిన వారి కుటుంబం నాకు కాంగ్రెస్ పార్టీకి గాని చేదోడు వాదోడుగా ఉంటూ వారి బాబు నరేష్ కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తున్నారు అని అన్నారు శ్రీనివాస్ మరణం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఆవేదన వెలిబుచ్చారు సంతాపం తెలిపిన వారిలో డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు దాసరి పూర్ణ నాగిశెట్టి రాధాకృష్ణ నాగభూషణం వెంకన్న బండారు శ్రీనివాస్ రావు ఎలగందుల శ్రీను రాకొండే కృష్ణ కందికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు

## నలుగురు మంత్రులకు బెదిరింపు లేఖలు

### ఒకే తరహాలో ఉన్న లేఖల సారాంశం

### పోలీసులకు ఫిర్యాదు చేసిన కందుల దుర్గేశ్ పిఎస్

**అమరావతి,ఫిబ్రవరి11 :** ఆంధ్రప్రదేశ్‌లో కొందరు కీలక మంత్రులకు అజ్ఞాత వ్యక్తుల నుంచి హెచ్చరికలతో కూడిన లేఖలు రావడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. జాగ్రత్తగా ఉండాలంటూ పంపిన ఈ లేఖలపై భద్రతా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఇప్పటికే మంత్రి కందుల దుర్గేష్ పీఎస్.. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్‌లకు కూడా ఇదే తరహా హెచ్చరిక లేఖలు అందాయి. ఒకే విధమైన సందేశంతో పలువురు మంత్రులకు లేఖలు రావడం వెనుక ఎవరు ఉన్నారన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో లేఖపై పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ లేఖల వ్యవహారం అసెంబ్లీ లాబీల్లో విస్తృత చర్చకు దారి తీసింది. హెచ్చరిక లేఖల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ప్రభుత్వం మరింత జాగ్రత్తలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. కందుల దుర్గేష్ మాట్లాడుతూ? 'మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖ చూసి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. నాకు చాలా మంది ఫోన్లు చేశారు. నేను పనిచేసేది టూరిజం లాంటి చిన్న శాఖ. దీంట్లో మావోయిస్టులు లేక రాయాల్సినంత పెద్ద హడావిడి ఏముంటుంది. వ్యక్తిగతంగా, శాఖ పరంగా ఎక్కడ ఎలాంటి తప్పులు ఉండవు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఈ లేఖలు రాసి ఉంటారు. మావోయిస్టులు లేఖలు ఇలా ఉండవు కదా?' అని అన్నారు.

## గవర్నర్ ప్రసంగం అడ్డుకునే యత్నం

### సబలో నినాదాలు చేస్తూ వైసిపి వాకౌట్




**అమరావతి,ఫిబ్రవరి11 :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు బుధవారం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం అయ్యాయి. గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ.. సభ నుంచి వాకౌట్ చేశారు. లడ్డు కల్తీ ఆరోపణలు, నిరుద్యోగ భృతి అంశం, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వంటి విషయాలపై ప్రభుత్వం వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. సభలో స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైసీపీ సభ్యుల నినాదాలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. కొందరు సభ్యులు స్పీకర్ చైర్ వైపు పేపర్లు విసిరి నిరసన వ్యక్తం చేశారు. సభలో క్రమశిక్షణ పాటించాలంటూ స్పీకర్ సూచించినప్పటికీ.. వైసీపీ సభ్యులు ఆందోళన కొనసాగించారు. అనంతరం సభను బహిష్కరిస్తూ వాకౌట్ చేశారు. ఈ సంఘటనతో అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా మరింత వేడెక్కాయి. ప్రభుత్వ–ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదురే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## వేములవాడలో ఓసేసిన ఎన్నారై

**వేములవాడ,ఫిబ్రవరి11 :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని చెబుతున్న కొందరు గడప దాటని విధానం ఇంకా కొనసాగుతూనే ఉంది. వేములవాడ పురపాలక సంఘం ఎన్నికల్లో మాత్రం ఏకంగా వేల కిలోమీటర్ల ప్రయాణం చేసి అమెరికా నుండి వచ్చి ఒకరు పురపాలక సంఘం ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం సర్వత్రా హర్ష వ్యక్తమవుతోంది.అమెరికాలో ఉద్యోగంలో స్థిరపడిన కార్తికేయ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేములవాడకు వచ్చి 28వ వార్డులో తన ఓటు వినియోగించుకున్నారు. యువతకు ఆయన ఓటుకున్న విలువను గురించి తెలియజేసినట్లుగా స్థానికులు తెలిపారు.

## కరీంనగర్‌లో ఓటేసిన బండి దంపతులు

### ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్‌కు చిత్తశుద్ధి లేదని వ్యాఖ్య

### కెసిఆర్‌పై చర్యలకు వెనకాడుతున్నారని విమర్శ




కరీంనగర్,ఫిబ్రవరి11 : మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జ్యోతినగర్ ఎస్ఆర్ హైస్కూల్లో కుటుంబ సభ్యులతో కలిసి కేంద్రమంత్రి బండి సంజయ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేస్తున్నారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ రెడ్డివి ఊకదంపుడు ప్రసంగాలు మాత్రమే అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు రేవంత్ భయపడుతున్నారా? కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోరా? అని మంత్రి ప్రశ్నించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డికి రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. యూరియా పక్కదారి పడుతున్నా ఏమిపట్టడం లేదా అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్‌లో యూరియా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కేంద్రాన్ని విమర్శించడం తప్ప.. రాష్ట్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు ద్రోహి అంటూ వ్యాఖ్యానించారు. టీవీల ముందు తప్ప.. రైతుల పట్ల బాధ్యత లేదా అని, యూరియా మీద కనీసం సమీక్ష చేయరా అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో రైతులు గోసపడారని మంత్రి అన్నారు.

## బోధన్‌లో దొంగ ఓట్లేసేందుకు యత్నం

### ఇద్దరిని గుర్తించి పట్టుకున్న పోలీసులు

**నిజామాబాద్,ఫిబ్రవరి11 :** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో అక్కడక్కడా కొందరు దొంగ ఓట్లు వేసేందుకు వచ్చి పట్టుబడ్డారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం రాకసిపేట గోశాలలో దొంగ ఓట్లు వేసేందుకు ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించారు. బూత్ నెంబర్ 24, 78 లలో ఇతరుల పేరుతో ఓటు వేసేందుకు ఇద్దరు యువకులు వచ్చారు. తప్పుడు గుర్తింపు పత్రాలతో పోలింగ్ కేంద్రంలోకి రావడంతో అధికారులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. దీనితో బోధన్ పట్టణం 21వ వార్డు పరిధిలోని అరీసా సాగర్ నగర్ లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఒకే చోట బీఆర్ఎస్, ఓఎఓ రెండు పార్టీల కార్యకర్తలు గుమ్మిగూడారు. ఒక్కసారిగా పరస్పర నినాదాలు చేపట్టారు. దాంతో ఆ ప్రాంతమంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. రెండు పార్టీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఒకే చోట బిఆర్ఎస్, ఎంఐఎం కార్యకర్తలు గుమిగూడి పరస్పర నినాదాలు చేశారు. దీనితో ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టారు.

## మారిన గుర్తుల క్రమసంఖ్య

### ఆందోళన వ్యక్తం చేసిన అభ్యర్థులు

**మహబూబ్‌నగర్,ఫిబ్రవరి11 :** మున్సిపల్ ఎన్నికల్లో గందరగోళం నెలకొంది. మహబూబ్‌నగర్‌లోని 45వ డివిజన్‌లో ఓటర్లకు ఇస్తున్న బ్యాలెట్ పేపర్లపై సీరియల్ నంబర్లు, గుర్తులు తారుమారు కావడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేసారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అధికార యంత్రాంగం ఇచ్చిన బ్యాలెట్ నమూనా ఒకలా ఉంటే.. పోలింగ్ రోజు మరోలా ఇస్తున్నారని వాపోయారు. ముందుగా ఇచ్చిన నమూనా బ్యాలెట్‌లో ముందు ప్రధాన పార్టీల గుర్తులు.. ఆ తర్వాత జనసేన, ఇతర పార్టీల గుర్తులను ఇచ్చారు. కానీ అనూహ్యంగా పోలింగ్ రోజు ఇచ్చిన బ్యాలెట్‌లో జనసేన పార్టీకి ఒకటో నంబర్ ఇచ్చారు. దీంతో ప్రధాన పార్టీల గుర్తులన్నీ మారిపోయాయి. ఎన్నికలు ప్రారంభమయ్యాక ఇది గమనించిన అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. దీంతో 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది.అభ్యర్థుల ఆందోళనతో రంగంలోకి దిగిన అధికారులు అభ్యర్థులతో చర్చించారు. సమన్వయంతో ఓటింగ్ ప్రక్రియను పున:ప్రారంభించారు.





# వర్క్ షాప్..!





**అమరావతి/కర్నూల్ , చట్టం న్యూస్( 10 ఫిబ్రవరి 2026):**
బాల కార్మిక వెట్టి చాకిరి నిర్మూలన చట్టం 1976 నుండి అమలు చేశారు. ఇప్పటికి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపద్యం లో వారోత్సవాల్లో భాగంగా అమరావతిలోని విట్ యూనివర్సిటీ లో న్యాయమూర్తుల సమక్షంలో వర్క్ షాప్ నిర్వహించారు ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏపీ హై కోర్ట్ ఏపీ ఎస్ ఎల్ ఎస్ ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మన్వేంద్రనాథ్ రాయ్, విశ్రాంతి హైకోర్ట్ న్యాయమూర్తులు శేషసాయి, కృపాసాగర్ లు పాల్గొని సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి గోడపత్రికలు విడుదల చేశారు.
ఏపీ న్యాయశాఖ, ఐజేఎం, విట్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు,
రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు , ప్యానెల్ న్యాయవాదులు, పిఎల్వీలు న్యాయవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణ పై అవగాహన సదస్సు...






**మహబూబాబాద్ జిల్లా తొర్రూర్, ఫిబ్రవరి 11 (చట్టం న్యూస్) :** తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో హరిపిరాల గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. సైబర్ నేరాల నివారణపై తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ సంయుక్తంగా మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలలో అవగాహన కల్పించారు. మరియు మొబైల్ ను వాడుతున్న ప్రతి ఒక్కరూ సైబర్ మోసాల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలనీ, తెలియని వ్యక్తుల నుండి ఫోన్ కాల్ వచ్చి లాటరీ తగిలిందని బంపర్ ఆఫర్ వచ్చిందని మీ మీ అకౌంట్లో జమ చేస్తామని మాయమాటలు చెప్పి అకౌంట్ నెంబర్ పాన్ కార్డు నెంబర్ ఆధార్ నెంబర్ లాంటివి అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియపరచకూడదనీ, సామాన్యుల కోసం కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద ఏడాదికి 20 రూపాయలు చెల్లిస్తే 2 లక్షల రూపాయలు ప్రమాద భీమ వర్తిస్తుందని ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా ప్రయోజన పథకం రైతులకు క్రాప్ లోన్ సంవత్సరం లోపు రెన్యువల్ చేయించుకోవాలని, అకౌంట్ ఓపెన్ చేసి 10 సంవత్సరాలు దాటిన వారు మళ్ళీ కేవైసీ చేయించుకోవాలని ఇతర పథకాల పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన చేసేలా గ్రామ ప్రజలతో సైబర్ నివారణల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అరిపిరాల గ్రామ ప్రజలకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్యాంక్ మేనేజర్ సీతారాములు, ఫీల్డ్ ఆఫీసర్ నాగరాజు,బ్యాంక్ మిత్ర అరుణ్, సి ఎ వీరన్న, ఎఫ్ ఏ నరేష్, రాములు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# ఎన్‌స్టీన్ ఫైళ్లో అనిల్, హర్దీప్ పురీల పేర్లు

**కేంద్రం చర్యలకు వెనకాడుతోంది**
**మీడియాతో రాహుల్ విమర్శలు**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి11 : రాహుల్ పార్లమెంటు వెలుపుల విలేకరులతో మాట్లాడుతూ.. 'హర్దీప్ పూరీ, అనీల అంబానీల పేర్లతో ఉన్న ఎప్‌స్టీన్ ఫైళ్లు న్యాయశాఖ వద్ద ఉన్నాయి. అదానీపై కొనసాగుతున్న కేసులో ఇప్పటికే సమన్లు జారీ చేయబడ్డాయి. దీనిపై గత 18 నెలలుగా భారత ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. ఈ విషయంపై ప్రధానిపై ప్రత్యక్ష ఒత్తిడి ఉంది. ఇక్కడ ప్రధాన విషయం ఏమిటంటే డేటా పరంగా చూసినా..ఇప్పటివరకు రైతులు, ఇంధన భద్రత, రక్షణ పరంగా కూడా ఏ ప్రధానమంత్రి కూడా
ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఇలా చేయలేదు అని అన్నారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కింద కీలకమైన జాతీయ ప్రయోజనాలను ప్రధాని మోడీ వదులుకున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఆర్థిక సర్వేపై మాట్లాడుతూ..ప్రపంచ క్రమం అమెరికా ఆధిపత్యంలో ఉన్న ఏకధ్రువ వ్యవస్థ నుండి చైనా, రష్యాలు సవాలు చేసే బహుళ ధ్రువ వ్యవస్థ దిశగా పయనిస్తోందని అన్నారు. ఇంధనం, ఆర్థికరంగాలను ఈ ఒప్పందం దెబ్బతీస్తోందని అన్నారు. డాలర్ ఆధిపత్యం ఒత్తిడిలో ఉందని, ప్రపంచం అస్థిరత మరియు సంఘర్షణలోకి వెళుతోందని అన్నారు. కృత్రిమ మేధస్సు (ఎఐ) అంతర్జాతీయంగా పోటీకి కేంద్ర బిందువుగా మారిందని అన్నారు. భారతదేశ సాఫ్ట్‌వేర్‌రంగాన్ని ఎఐ దెబ్బతీస్తోందని, ఇన్ఫోసిస్ మరియు ఇతర కంపెనీల్లో పెద్ద సంఖ్యలో ఇంజనీర్లను భర్తీ చేస్తోందని హెచ్చరించారు. భారతదేశ బలం, దాని 140 కోట్ల ప్రజలు ఉత్పత్తి చేసే డేటాలో ఉందని అన్నారు. అమెరికన్ వస్తువులు తమకు అనుకూలమైన నిబంధనలతో దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయని అన్నారు. భారతదేశ అమెరికా ఎగుమతులు 46 బిలియన్ డాలర్ల నుండి 146 బిలియన్ డాలర్లకు పెరగడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే అమెరికా నుండి తగిన నిబద్ధత ఎందుకు లేదని ప్రశ్నించారు. గతంలో తాను హర్యానా, గురుగావ్‌లోని పరిశ్రమలను సందర్శించానని, టారిఫ్‌ల మార్పులు పరిశ్రమలను తీవ్రంగా దెబ్బతీయనున్నాయని వాటి యజమానులు ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు.

# అసెంబ్లీలో సబ్జక్టుపై అవగాహనతో రావాలి

**ఆవు కథలు చెప్పి తప్పించుకోరాదు**
**ప్రతిరోజూ అటెండెన్స్ ఉండాల్సిందే**
**ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు సూచన**



అమరావతి,ఫిబ్రవరి11 : వ్యక్తిగత కక్షల ప్రస్తావనకు అసెంబ్లీని వేదికగా చేసుకోవద్దని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సూచించారు. సమస్యలను చర్చించి సిద్దంగా ఉండాలన్నారు. సబ్జక్ట్‌పై ప్రిపేర్ రావాలని అన్నారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 నెలలుగా కూటమి నేతల ఐక్యత కొనసాగుతోందని చెప్పారు. కింది స్థాయిలోనూ ఇదే పరిస్థితి ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో 3 పార్టీల నేతలు సమావేశాలు పెట్టుకుంటూ ఐక్యత పెంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేల పనితీరుపై అసెంబ్లీ సమావేశాల సమయంలో మాట్లాడతా. 40 మందిని వ్యక్తిగతంగా పిలిపించుకుని మాట్లాడతా. ఆవు కథలు చెప్పడం మాని స్జబెక్ట్ ప్రిపేర్ అయి సభకు రావాలి. ఎవరేం మాట్లాడుతున్నారో నేనూ నోట్ చేసుకుంటా అని అన్నారు. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి ఒక్కరూ ఉండాలి. నేను కూడా రోజూ ఉదయం 11 గంటల నుంచి సెషన్ అయ్యే వరకూ అసెంబ్లీలో ఉంటా. సభలో మాట్లాడేది 5 కోట్ల మంది ప్రజలకు జవాబుదారీని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. అక్కడ ఏం మాట్లాడినా వారి కోసమేనని గ్రహించాలి. అనుకున్న విషయాన్ని 3 నుంచి 7 నిమిషాల్లో మాట్లాడాలి. కూటమి ప్రభుత్వంతో ప్రజలకు జరుగుతున్న లబ్దిని ఎప్పటికప్పుడు చెప్పాలి. రూ.లక్ష కోట్లకు పైగా హైవే పనులు, రూ.90వేల కోట్లకు పైగా రైల్వే పనులు జరుగుతున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో విశాఖ స్టీల్‌ఎ÷-లాంట్ రూ.450 కోట్ల నష్టంలో ఉంది. నష్టాలను అధిగమించి రూ.54 కోట్ల లాభాల్లోకి రావడం శుభపరిణామం. కేంద్ర ప్రాయోజికత కార్యక్రమాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. అన్ని మతాలను గౌరవించాలి.. భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయకూడదు. జగన్‌కు మతాలపై గౌరవం లేనందునే వైకాపా హయాంలో రామతీర్థం సహా అనేక ఆలయాలపై దాడులు జరిగాయి. తిరుమల శ్రీవారి లడ్డూతో పాటు ఎక్కడ వీలైతే అక్కడ కల్తీకి పాల్పడ్డారు' అని చంద్రబాబు అన్నారు.

# ఉప సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నిక



**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 11 :** సింగరాయపాలెం గ్రామం ఉప సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ కూటమి బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సురభి కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది.

# మున్సిపల్ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్న "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 11 ,(చట్టం బ్యూరో) :** ఓటు చాలా విలువైనదని మరియు సమాజాభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒ వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా స్థానిక 52 డివిజన్ లోని ఓటింగ్ కేంద్రంలో వారి ఓటు హక్కును వినియోగించిన అనంతరం వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడమే కాకుండా సమాజాభివృద్ధిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటు చాలా విలువైనదని ప్రధానంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ప్రత్యేకమైన స్థానమున్నదని అని వారు గుర్తు చేశారు. ఓటు ద్వారానే ప్రభుత్వం ఏర్పడుతుందని ఆ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి జరుగుతుందని గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని వారు చెప్పారు. మొట్టమొదటిసారిగా ఓటు వేసేవారు ఆలోచించి సరైన నాయకునికి ఓటు వేసి అభివృద్ధికి చేయూతనివ్వాలని వారు పిలుపునిచ్చారు.

# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- పోలింగ్ కేంద్రంలో సెల్ఫీ పాయింట్ వద్ద సిబ్బందితో
- యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**భూదాన్ పోచంపల్లి ; ఫిబ్రవరి 11 (చట్టం ప్రతినిధి) :** పురపాలక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది . పట్టల కేంద్రంలోనీ 13 వార్డులకు గాను 26 పోలింగ్ స్టేషన్లో జరిగిన పోలింగ్ శాతం 90 . 94 శాతం జరిగింది 15827 ఓట్లకు గాను 14394 ఓట్లు పోలైనట్లు తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు . ఉదయం నుండి ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్లో పాల్గొన్నారు . సీతవాణి గూడెంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతరావు సందర్శించి పరిశీలించారు . సెల్ఫీ పాయింట్ వద్ద పోలింగ్ సిబ్బందితో కలెక్టర్ ఫోటోలు దిగారు. పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సందర్శించారు . 23. 24 పోలింగ్ కేంద్రాల్లో కొంత సమయం పాటు తలుపులు వేసి సిబ్బంది భోజనం చేయడం పట్ల భాజపా నాయకులు అభ్యంతరం తెలిపారు . అధికారులు చొరవ తీసుకోవడంతో సమస్య సద్దుమణిగింది . అత్యధికంగా ఒకట వ వార్డు , అత్యల్పంగా 13వ వార్డు లో ఓటింగ్ జరిగింది .

# పుర సంగ్రామం ముగిసింది..

- ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులులి
- అభ్యర్థుల జాతకాలు బ్యాలెట్ బాక్సుల్లో భద్రం





**అందోల్ మండల్ ప్రతినిధి ఫిబ్రవరి 11 (చట్టం)న్యూస్ :** జోగిపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్: ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిస్తాయి. ఉదయం ఏడు గంటల నుండే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల సందడి కనిపించింది. ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీలో 20 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించగా అందులో అభ్యర్థుల జాతకాలు తేల్చేందుకు ఓటర్లు సమాయత్తమయ్యారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంగతులు జరగకుండా ముందస్తు చర్యలుగా పోలీసులు జాగ్రత్త పడ్డారు. మధ్యాహ్నం వరకు అధిక సంఖ్యలో మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 80 శాతం పోలింగ్ జరిగినట్టు అధికారులు వెల్లడించారు.

# ఎదులా పురం మున్సిపాలిటీ లో కాంగ్రెస్ విజయకేతనం



**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 11 :** ఎగరవేస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకులు పరికపల్లి శ్రీను జోస్యం చెప్పారు రాష్ట్ర ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజవర్గం లో కోట్లాది రూపాయలు అభివృద్ధి పనులు చేపట్టి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని పేద ప్రజలకు ప్రజా పభుత్వం లో పథకాలు అందుతున్నాయని సొంత ఇంటికల ఇందిరమ్మ ఇళ్ల తో నెరవేర్చారని కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు పూర్తి విశ్వాసం తో ఉన్నారని వైరా శాసన సభ్యులు రాందాస్ నాయక్ నేతృత్వం లో వైరా మున్సిపాలిటీ లో కాంగ్రెస్ కైవసం పక్కా అని తెలిపారు ఖమ్మం జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు కాంగ్రెస్ వశం చేసుకుంటుంది అని తెలిపారు కాంగ్రెస్ పార్టీ కి ఓటువేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ కోసం పని చేసిన కార్యకర్త కు నాయకులకు ధన్యవాదములు కృతజ్ఞతలు తెలిపారు

## చట్టం సాహితీ లోకం
95814 19999

### సంబరం




పండగా పబ్బం వస్తే ప్రజలకు సంబరం
ఆడది అమ్మ అయితే సంబరం
విద్యార్థికి ఉద్యోగం దొరికితే సంబరం
నాయకులు ఎన్నికల్లో గెలిస్తే సంబరం
సినిమా విజయవైతం అయితే అభిమానులకు సంబరం
రాకెట్ లక్ష్యాన్ని చేరితే సైంటిస్ట్ లకు సంబరం
పిల్లలు బాగా చదివితే మాస్టారు కు సంబరం
ప్రాజెక్టు విజయవంతం అయితే
ఇంజనీర్లకు సంబరం
ప్రేమ పెళ్లిగా మారితే ప్రేమికులకు సంబరం
అవార్డులు వస్తేనే కళాకారులకు సంబరం
న్యాయం జరిగితే ధర్మానికి సంబరం
యుద్ధం గెలిస్తే రాజ్యానికి సంబరం
పంటలు బాగా పండితే రైతులకు సంబరం
బానిసలకు స్వేచ్ఛ దొరికితే సంబరం
కూలీలకు పని దొరికితే సంబరం
అనాథలకు ఆశ్రమం దొరికితే సంబరం
అంధులకు చూపు వస్తేనే సంబరం
రాజులకు నిధులు దొరికితే సంబరం
ప్రజలు సుఖంగా జీవించాలి సంబరంగా అంబరంగా ...

డి చాంద్ బాషా రచయిత

## చట్టం సాహితీ లోకం
95814 19999

### ఆంజనేయస్వామి పుష్ప పల్లకి సేవ నేడు :



మావూరి దేవునిరథోత్సవం 11-2-2026.

పల్లవి- శ్రీ ఆంజనేయాఅభయాంజనేయా..
భక్తులబ్రోచే..
వరదుడనీవయదేవా.. "2"

చ - అంజని పుత్రా అభయాంజనేయా....
బలవాయుపుత్రా వజ్రపు శరీరా..
సంజీవరాయా అభయాంజనేయా..
శ్రీరామభక్తా .. హనుమంత రాయా..". శ్రీ "

చ -నిను మది తలచిన తొలగు కష్టాలు..
నిను గాంచినంతనే కలుగు శుభాలు..
శ్రీరామ దాసులకు ప్రేరణ నీదయా..
నిర్మలభక్తికీ నిచ్చలశక్తికీ నిజరూపమునీవయా.." శ్రీ "

చ - అసుర సంహారా..అభయాంజనేయా..
అవనిలోనీకన్న మము బ్రోచు వారేరయా..
అంధ కారమున మా మది లయతప్పునయా
గతిని,స్థితిని మార్చి మముబ్రోవుమయాదేవా.." శ్రీ

చ - శ్రీ రామనామమేనీ ప్రతిశ్వాసయా...
శ్రీభక్తవల్లభుడవు,సత్య వ్రతుడవు నీవయా ..

కొలిచేవారికిమదిననిలిపేవారికిఆశ్రీతవత్సలుడవయా .
శ్రీ రామనామమేలోక రక్ష యని నమ్మినవాడవయా ."శ్రీ"

చ:-అల రామయ్య కు చెప్పి పూలరథ మెక్కి
ఊరేగ రావయ్యా.. మమ్మేలు మా స్వామి
మదిఊయల కట్టాము మమ్మేలు మా స్వామి
మదిలోన కొలిచేము నిను మదిలోన నిలిపాము
వేంకటగిరికోటకు అధి నాయకుడల్లే
అక్కున జేర్చుము, ఆపదలు కాయుము స్వామి...
అభయాంజనేయా.. ఆశ్రీత లోలా..

డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం..
కవి, రచయిత, విశ్రాంత ఉపాధ్యాయులు
వి. కోట. చిత్తూరు జిల్లా.9000169823.

## చట్టం సాహితీ లోకం
95814 19999

### వినవోయి సోదరా వింతలోకమాయె

వినవోయి సోదరా వింతలోకమాయె ఇది
కనవోయి బాంధవా బంధాలు దూరమౌతున్నవి
కన్న తలిదండ్రులను కూడా కడతేర్చుచున్నారు
తమ తోబుట్టువుల ప్రేమను తొలగించుకుంటున్నరు

అన్నదమ్ముల ప్రేమలు ఆమడదూరంబాయె
అత్తమామల మాటలకే విలువ ఎక్కువాయె
బావమరుదలతోటి బంధాలు పెంచుకొని
కలసి తిని తాగా తందనాలాటలాయె

ఆలి చెప్పిన మాట వేదమే అయ్యింది
మగని మాటంటే లెక్కచేయకుంటైనారు
కనుకున్న పిల్లలను సైతము
హతము చేసుకుంటున్నారు
కాముకులై కన్ను మిన్ను గానకున్నారు

బ్రహ్మంగారు చెప్పిన కాలమే వస్తుంది
వింతలెన్నో లోకంలోన జరుగును నిజము
గురువులకే పంగనామాలు పెడుతున్నరు
పంతుళ్ళు పిల్లలకు ప్రేమపాఠాలు చెపుతున్నరు

భయభక్తులు కరువాయె విద్యార్థులకు
గంజాయి తాగి తైతక్కలాడుచున్నారు
విలువలు లేని విద్యలాయెను
నైతిక విలువలు కరువాయె ఈ జగమందు


అయ్యయ్యో! ఇది ఏమి లోకమైపోయె
అవినీతి పనులకు అంతేలేకపోయెనీనాడు
అన్ని రంగాలలో అవినీతి పెరిగెను
దేశగౌరవం నేడు మంటలో కలుస్తున్నది

అక్కి నర్సింలు గౌడ్
విశ్రాంత ఉపాధ్యాయుడు
మల్లాపూర్
రంగారెడ్డి జిల్లా
కవి గాయకుడు



## చట్టం సాహితీ లోకం
95814 19999

### కోతికి ప్యాకెట్ మనీ - కొంపకు నిప్పు



అల్లరి పిల్లలు అడవి కోతులే...
వారి కోరికలు అందని ద్రాక్షలే...
తల్లిదండ్రులు ఆకలి తీర్చే అరిటాకులే...
పిల్లలు ఆఆకుల్ని చిరునవ్వులతో చీల్చే
గులాబీ గుండెల్లో గుచ్చుకునే ముళ్లులే...

ప్రేమతో ఇచ్చే ప్యాకెట్ మనీకి
కోత పెడితే..? కొంపలారిపోతాయి
పిల్లకోతులు ఇల్లు పీకి పందిరేస్తాయి
ఎందుక్కన్నారంటూ ప్రశ్నిస్తారు
కోర్టులో లాయర్లలా వాదిస్తారు
ప్యాకెట్ మనీ కోసం వేధిస్తారు
నో అంటే ఏటీఎం కార్డులు
లాగేసుకుంటారు పిన్ లు మార్చేస్తారు.

చేతిలో సెల్ ఫోను లాక్కుంటే
పిల్లలు శివమెత్తిన రుద్రులే,
యూట్యూబ్ లో ఆడేగేమ్స్ కి అడ్డుపడితే
నిప్పులు చెరిగే అగ్నిపర్వతాలే, నిజానికి
పిల్లల పెంపకం నిప్పుతో చెలగాటమే,

తేనెతుట్టెను కదిపి తేనె కోరుకోవడమే...
మొక్కై వంగనిది మానై వంగదు...
పిల్లల మొండితనం ముదిరితే ముప్పే...
నిఘా పెట్టకపోవడం తల్లిదండ్రుల తప్పే...


ఇదిగో బైబిల్ సందేశం స్మరించుకో
ఈ అపాయం నుంచి తప్పించుకునే
ఉపాయమిదే గుర్తుంచుకో
ముందుగా నీ కంటిలో ఉన్న
"దూలాన్ని" తీసెయ్
అప్పుడు నీ బిడ్డ కంటిలోని
"నలుసు" నీకు తేటగా కనిపిస్తుంది.
తీసివేయుట సులభమే...

ప్యాకెట్ మనివ్వకపోతే పిల్లలు
నీరులేని చెరువులో చేపలే...
చేతిలోని సెల్ ఫోన్ లాగేస్తే
గాయపడిన చిరుత పులులే...

పిల్లల పెంపకానికి క్రమశిక్షణే శ్రీరామరక్ష.

అందుకే ఓ తల్లిదండ్రులారా...
జాగ్రత్త తస్మాత్ జాగ్రత్త...
మీ సెల్లు జాగ్రత్త...
మీ ఒళ్లు జాగ్రత్త...
మీ ఇల్లు జాగ్రత్త...
మీ కళ్ళు జాగ్రత్త...
అగ్గి పుల్లల్లాంటి మీ పిల్లలు జాగ్రత్త...
అప్రమత్తంగా లేకపోతే అంతా భస్మమే..!

రచన:
కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్



## చట్టం సాహితీ లోకం
95814 19999

### మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు



తెలుగు ప్రభంజనం
తెలుగు కు ప్రపంచ గౌరవం తీసుకొస్తున్న శ్రీ చైతన్య రాజు

(గాలిపటాలు ప్రక్రియలో...)

1. తెలుగుకు ప్రపంచ గౌరవం తీసుకొస్తున్న తెలుగు శిఖరం శ్రీ చైతన్య రాజు/
తెలుగు భాషా చైతన్యానికి ఆయన కొత్త ఊపిరి/
అందర్నీ కలుపుకుంటూ చిరునవ్వుతో స్వాగతం/
తెలుగువారి హృదయాలలో చిగురిస్తున్న మీ రూపం తెలుగు దీపం/

2. కోనసీమ కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తూ ఆత్మీయ పచ్చనినవ్వుల్ని పూయిస్తూ/
కాలాన్ని ధనాన్ని వినియోగిస్తూవిశ్రాంతి ఎరగని తెలుగు అక్షర వీరుడు ప్రతిభావంతుడు చైతన్య రాజు/
రెండు ప్రపంచ తెలుగు మహాసభలు దిగ్విజయంగా నిర్వహించి ప్రశంసలు పొందిన ప్రతిభా శీలి/
మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు కిమ్స్ వైద్య కళాశాలమైదానంలో తెలుగు జెండా ఎగరేస్తూ తెలుగు భాషకు సాంస్కృతికి అంతర్జాతీయ గౌరవం తీసుకొస్తున్నమీ కృషికి శుభాభినందనలు/

3. ఫిబ్రవరి 28 మార్చి ఒకటో తేదీలు తెలుగు వాళ్లకు మరోసంక్రాంతి పండుగ సంబరాలు/
తెలుగు మళ్లీ కవులు కళాకారులతో పద్యాలతో అక్షరాల ధారణతో కొత్త వేదికగా కొత్త వెలుగుల వేళ/
నిన్నటి వారసత్వానికి వందనం
రేపటి నవతరానికి సంకల్పం /
కాలానికి కళ్ళు గా ప్రపంచ తెలుగు వైభవానికి ఇదే నవ క్రాంతి/
కవులందరి కలాలు కలిసిన శుభ వేళ.../

4. వేదాల నుడికారం నుండి నేటి కవితల వరకూ సాహితీ వైభవం/ పచ్చని పల్లె పలుకుల జానపదం పరిమళంతో ప్రపంచాన్ని అలరించే తెలుగు వైభవం అదే మనందరికీ గౌరవం/
సంస్కృతి సాంప్రదాయాల సంగమం/ మూడవ ప్రపంచ తెలుగు మహాసభల మహత్తర అక్షర యజ్ఞం/
జై తెలుగు జై జై తెలుగు/

(2026 ఫిబ్రవరి 28 , మార్చి ఒకటవ తేదీలు రెండు రోజులపాటు అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల, కిమ్స్ హాస్పిటల్స్ మరియు గోదావరి గ్లోబర్ యూనివర్సిటీ ల సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో కే. వి .వి. సత్యనారాయణ రాజు శ్రీ చైతన్య రాజు ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా శ్రీ చైతన్య రాజు ను అభినందిస్తూ
రచించిన కవిత)

నల్లా నరసింహమూర్తి
సీనియర్ తెలుగు లెక్చరర్
శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు
కురసాల వారి వీధి
అమలాపురం..533201
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
9247577501



## చట్టం సాహితీ లోకం
95814 19999

### కవితావైభవమీయ వాగ్ధామ వీవె



మందాక్రాంత
ఓంకారిన్ వాణిని గుణగణన్ హూంకృతాకారి ధీంక్లీం
యైంకారిన్ హ్రీంకృత చరిత హంసాసనిన్ సౌం ప్రతీతిన్
శ్రీంకారిన్ గొల్తు శుభకరి శ్రీచిద్విలాస్యాస్య భూతిన్
గైంకర్యంబున్ గొని కవన వాగ్వైభవం బీయవమ్మా

మందాక్రాంత
శ్రీవాణీ వాగ్విభవ భవులక్ష్మీ సమస్తార్థ శబ్దః
కైవల్యాంభోనిధి కవిజనః క్షత్రకీర్తి ప్రభావా
చీ వర్ఛస్ప్రౌఢి శుభకరి సచ్ఛీల సంతోషి మద్భు
ద్భావోద్భీజాంకుర సదమలంబా భవానీ నమస్తే

మందాక్రాంత
ఈభూమిన్ నాగలి గెలుకగా నిచ్చు నా సస్యరాశిన్
శ్రీభవ్య స్ఫూర్తినిడు గురుడే శ్రీపదం బీయ మాకున్
శోభాహ్లాదంపు మణియగునో శుక్తిలో స్వాతి కార్తిన్
యా భవ్యాపార్థద భవుసతీ యాత్మ పుష్పాసనీ శ్రీ

మందాక్రాంత
తల్లిన్ దండ్రిన్ సచివసతి సద్బాంధవంబై యశంబున్
ఉల్లేఖింపన్ నిజము దెలుపున్ ఊర్ధ్వలోకాలిడున్ మీ
కుల్లాసంబౌ సుగతులిడు సంకోచమేలా గుణంబున్
జెల్లింపన్ వేడెద నుడుగరన్ జిత్సుఖమందించు వాణీ

మందాక్రాంత
చెల్లున్గాలంబు దినదినమున్ జీవనభ్రాంతి, లీలన్
వెల్లన్ గాలంబు నెవరెవరో బిల్చినన్ బల్కునా రా
త్రుల్లెవ్వండీడ్చు సుఖసఖియై త్రోవ దప్పెన్ భవానీ
పిల్లన్ గాపాడు సుదతివలెన్ బ్రేమ లాలింపుమమ్మా

మందాక్రాంత
సందేహాంధుండు గనగలడే సత్వతేజో ప్రశాంతిన్
సందేశం బిత్తువు నెడదకున్ సాహితీశుద్ధి బుద్ధుల్
సంధింపన్నేరరు గవులహో శక్తినీయందగున్ ని
స్పందేహంబీవు జననివి సంజాతుడేనమ్మ వాణీ

శార్దూలము
శౌచాన్వీక్షయు ప్రేమభావనలు విశ్వాసోర్ధ్వలోకాలిడున్
వాచాత్మక్రియ నొవ్వనీయనిది సంపాద్యంబు దాతవ్యమున్
యోచింపన్ హితమై యథార్థమగు సాయుజ్యంబులన్ ధర్మమున్
యాచింతున్ నిను నిర్మలత్వసుమ సామ్యాత్మార్థ వైభోగమే

మందాక్రాంత
ఆలోచింపన్మది సుఖకరంబైన పుణ్యాంగి పుష్పా
లేలీలన్ బుట్టును మనమునన్ లేశమైనన్ పురాప్రా
ప్తాలభ్యాభ్యాసము గడగకే బ్రజ్ఞబీజంబు శూన్యం
బే లీలన్లేచ్ఛంద్రుణము జలత్వేలలన్ శారదమ్మా

మందాక్రాంతం
నీవై వ్రాయించు మజుసతి నిన్నేభజింతున్ బదాళిన్
దేవీ పరీంతావికి మధుపముల్ దిర్గుభంగిన్ బ్రశాంతిన్
నైవేద్యంబిత్తును గొనుము బుణ్యాంగి రక్షింపుమమ్మా
మావైరాగ్యార్థ నగనిధులన్ మానినీ శారదాంబా

మందాక్రాంత
జన్మంబున్ బొందుట నిజమొకో జన్మమేయంతమో యే
జన్మంబందేను సలిపితినోచాలు నీపాటి తీర్పున్
సన్మంత్రాదేశము నిడుత నాజన్మ సార్థక్యమై యీ
జన్మన్ మోక్షార్థ మొసగవె హంసాసనీ శారదాంబా

రచన::శంకర్ జీ డబ్బికార్
ఊరు:: ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956

## చట్టం సాహితీ లోకం
95814 19999

### అమ్మే...అన్నీ...!!



అమ్మ...!
ఆమె ఒక చేతిలో ఇంటి తాళం కాదు
బాధ్యతల భారం ఉంటుంది!
మరొక చేతిలో పిల్లల చేతి వేళ్లు కాదు
వారి రేపటి దారులు ఉంటాయి!

సంసారం ఒక సముద్రమైతే
దానిని దాటించే నౌకాధిపతి అమ్మ!
అందులో ఎగసిపడే అలలను
ఓర్పుతో తట్టుకునే నగశిఖరం అమ్మ!

ఆమె ఉదయించే సూర్యుడిలా
అందరికన్నా ముందే లేస్తుంది!
ఆమె చల్లని వెలుగుల చంద్రుడిలా
కుటుంబాన్ని సదా కాపాడుతుంది!

అమ్మ అంటే...
వంటగదిలో మరిగే పాత్ర కాదు
త్యాగంలో పునీతమైన హృదయం!
ఆమె మాటలు మందుల్లా నయం చేస్తాయి
ఆమె మౌనం ప్రార్థనలా రక్షిస్తుంది!

సంసార వృక్షానికి ఆమె తల్లివేరు
పిల్లల జీవితానికి ఆమె చల్లని నీడ
ఇల్లంటే ఇంకేమీకాదు అమ్మే!
ఇంటికి ఊపిరి ఇల్లాలుగా ఉన్న అమ్మే!

---------------



E.V.V.S. వర ప్రసాద్
కవి, ఉపాధ్యాయుడు,
తుని ( కాకినాడ జిల్లా )
కలం పేరు : వరశ్రీ

## చట్టం సాహితీ లోకం

95814 19999

### నీళ్ళు...



మంచినీరు ---
దేహాల దప్పికను తీరుస్తూ
ప్రాణాలకి ప్రాణవాయువుగా మారే
పంచభూతాల సత్యస్వరూపం.

తేనీరు ---
అలసట అంచున
వేడిగా పలకరించే
సాధారణ స్నేహం, ఆనందం.

చన్నీరు ---
ఆకలికి ముందే
అమ్మ చేతులు అందించే
శాంతి జలం, ప్రసాదం.

ఎలనీరు ---
వేసవి గాడ్పులకు
ప్రకృతి ఔషధం,
శరీరానికి శ్రేయం.

ఏటినీరు ---
కాలం ఒడిలో పారుతూ
తరతరాల కథలు మోసుకొచ్చే
జీవనసాక్ష్యం, ప్రకృతిపుణ్యం.

వేడినీరు ---
నొప్పుల్ని కరిగించి
ఆరోగ్యాన్ని మెరుగుపరచే
చిన్న చికిత్స.

వాననీరు ---
ఆకాశం భూమికి రాసిన
ప్రేమలేఖ,
పంటలకు జీవం.

వరదనీరు -
హద్దులు చెరిపేసే
మనిషి అహంకారానికి
ప్రకృతి చేసే హెచ్చరిక.

పన్నీరు ---
ప్రేమ తాకితే
భావాలు పరిమళాలై పూసే
మౌన సుగంధం.

కన్నీరు -
హృదయం విరిగినపుడు
కళ్ళు చూపించే
మానసిక వేదన.

మున్నీరు
అంతులేని విస్తారం,
తరంగాల గుండెల్లో సమాధానం,
దాచుకున్న భూమిశ్వాస, తుపానుభీభత్సం.


ఇన్ని నీళ్ళు ---
ఒక్కొక్కటి ఒక్కో జీవితం,
ఒక్కొక్కటి ఒక్కో భావం.
నీరు లేక జీవితం లేదు, భావం లేక కవిత
లేదు.

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

## చట్టం చిత్రం

# తొలి జీతంతో స్కూలు ప్రారంభం

### నటి మోనాలిసా కీలక నిర్ణయం



మహా కుంభమేళాలో పూసల దండలు అమ్ముతూ ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించిన 'కుంభమేళా బ్యూటీ' మోనాలిసా ఇప్పుడు తన జీవితంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. తన మొదటి సినిమా నుంచి వచ్చే రెమ్యునరేషన్‌తో బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభిస్తానని ప్రకటించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. సాధారణ జీవితం నుంచి సినీ రంగం వరకు ఆమె చేసిన ఈ ప్రయాణం ఇప్పుడు ఎంతో మందికి ప్రేరణగా మారింది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సమయంలో మోనాలిసా దండలు అమ్ముతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమెకు అనూహ్యంగా సినిమా అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం ఆమె సినీ పరిశ్రమలో అడుగుపెట్టి వరుస చిత్రాలతో బిజీగా మారింది. ఇటీవల ఆమె తొలి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని భావోద్వేగానికి గురైంది. సినీ ప్రపంచంలోకి వచ్చినా తన పాత జీవితాన్ని ఎప్పటికీ మర్చిపోనని, ఆ అనుభవాలే తనకు బలం ఇచ్చాయని తెలిపింది. ఇటీవల మోనాలిసా మళ్లీ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి గంగా తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. తన జీవితాన్ని మార్చిన ఆ స్థలానికి కృతజ్ఞతలు తెలుపుతూ, సమాజానికి తిరిగి ఏదో చేయాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్ జిల్లాలో బాలికల కోసం పాఠశాల స్థాపించాలన్నదే తన కల అని చెప్పింది. ఆ ప్రాంతాల్లో అమ్మాయిలకు సరైన విద్యావకాశాలు లేవని, చదువు లేక వెనుకబడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

బాలికల విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని, అందుకే తన సంపాదనను వ్యక్తిగత సౌకర్యాల కోసం కాకుండా భవిష్యత్ తరాల కోసం వినియోగించాలనుకుంటున్నానని మోనాలిసా స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆమె మూడు సినిమాలతో బిజీగా ఉంది. అందులో రెండు తెలుగు చిత్రాలు కాగా, మరోటి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్'. సినీ రంగంలో ఎదుగుతూ సమాజానికి సేవ చేయాలన్న ఆమె సంకల్పం నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.

# పవన్, సురేందర్ రెడ్డి కాంబో

### పక్కా మాస్ ఎంటర్టైనర్ మూవీ




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్ గురించి ఫిలిం నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సురేందర్ రెడ్డి అంటే స్టైలిష్ యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాడు. కానీ ఈసారి పవన్ కళ్యాణ్ కోసం ఆయన తన పంథాను పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. పవన్ చేసిన యాక్షన్ సినిమా కంటే భిన్నంగా గతంలో సురేందర్ రెడ్డి అందించిన 'కిక్', 'రేసుగుర్రం' తరహాలో పక్కా హై-వోల్టేజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను పవన్ కోసం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే మేనరిజమ్స్‌తో కూడిన వినోదాన్ని వెలికితీయడమే లక్ష్యంగా రచయిత వక్కంతం వంశీ ఈ స్క్రిప్ట్‌ను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాలో పవన్‌కు జోడీగా ప్రభాస్ 'ఫౌజీ' సినిమా హీరోయిన్ ఇమాన్వీ పేరు ప్రముఖంగా వినిపిస్తుండటం విశేషం. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించి మరో క్రేజీ అప్‌డేట్ ఏమిటంటే, ఇందులో పవన్ కళ్యాణ్‌కు తమ్ముడిగా ఒక యువ అగ్ర హీరో నటించే అవకాశం ఉందని, అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో సాగే పక్కా మాస్ మూవీగా ఇది ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. నిర్మాత రామ్ తాళ్లూరి దాదాపు రూ. 250 కోట్ల భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన రాజకీయ బాధ్యతల నడుమ షూటింగ్‌లో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 2026 మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ పక్కా ఎ÷-లాన్‌తో ఉన్నారు. ఇప్పటికే పవన్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 26, విడుదల కానుండగా, ఆ వెంటనే ఈ భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది.

## చట్టం సాహితీ లోకం

95814 19999


### చెల్లని ఓట్లా.....?



చెల్లని ఓటు
ప్రజాస్వామ్యానికి చేటు
అక్రమార్జునులకు చోటు
ఓటు కు కడుతున్నారు రేటు
ఓటు ఎక్కడ చూసిన నోటు
ఓటు రాజ్యాంగం కల్పించిన
హక్కు
బడుగు బలహీన వర్గాలకు దిక్కు
ఓటు దివ్యాస్త్రం
ఓటు బ్రహ్మాస్త్రం
ఓటు పాశుపతాస్త్రం
ఓటు రాజకీయ నాయకుల అహంకారాన్ని
అణచడానికి పేదల అస్త్రం శస్త్రం
నిరక్షరాస్యుల ఓట్లు
వేయడంలో చేస్తారు పొరపాట్లు
గ్రాడ్యుయేట్ల టీచర్ల న్యాయవాదుల ఓట్లు
చెల్లని ఓట్లా .....?
అక్షరాస్యులకు నిరక్షరాస్యులకు ఓటు
వేయడం లో
చేస్తునే ఉన్నారు పొరపాట్లు
అక్షరాస్యుల నిర్లక్ష్యం
గుండాలకు రౌడీలకు
భూకబ్జా దారులకు పంచభక్ష్యం
రాజ్యాంగాన్ని చదివి
న్యాయవాద వృత్తిని చేపట్టి
ప్రజాస్వామ్య వ్యవస్థ
పటిష్టతకు ఓటు ఆవశ్యకత తెలిసి
ఓట్ల లో నిర్లక్ష్యం నిర్లిప్తత
చెల్లని ఓట్ల రోత
దీనికి వేయాలి మూత
ఎన్నికల్లో ఓట్ల ద్వారానే మోగించాలి
విజయ మోత
( ఇటీవల జరిగిన తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ ఎన్నికల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెల్లని ఓట్లు అధికంగా ఉండటానికి స్పందిస్తూ.....)

డాక్టర్.ఎస్. విజయ భాస్కర్,
అధ్యక్షులు,
హైదరాబాద్ ఓల్డ్ సిటీ రైటర్స్ అండ్
కల్చరల్ అసోసియేషన్ (హౌకా),
సైదాబాద్, హైదరాబాద్.

# నిఖిల్ స్వయంభు టీజర్ విడుదల




యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'స్వయంభు'. సమ్మర్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో, 3ఆ ఫార్మాట్‌లో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్ క్రీస్తుశకం 985 నాటి పరాక్రమవంతుడైన యోధుడిగా కనిపిస్తున్నారు. భారీ సెట్టింగ్‌లు, అద్భుతమైన పీరియడ్ వార్ సీక్వెన్స్‌లతో కూడిన ఈ టీజర్, నిఖిల్ మేకోవర్ మరియు ఆయన యుద్ధ విన్యాసాలను అద్భుతంగా ఆవిష్కరించింది. సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ విజువల్స్ సమకూర్చారు. 'కార్తికేయ-2' విజయం తర్వాత నిఖిల్ నటిస్తున్న ఈ చిత్రంపై టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఓటిటిలోనూ దురంధర్ దూకుడు




ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. దాదాపు రెండు నెలలు థియేటర్‌లలో సందడి చేసి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన ఈ చిత్రం.. ఇప్పుడు ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన 'ధురంధర్'.. జనవరి 30న నెట్‌ప్లిక్స్ (ఔఱబ్గొ÷తిలీ) వేదికగా డిజిటల్ ప్రేక్షకుల ముందుకు అందుబాటులోకి వచ్చింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన తొలిరోజు నుంచే వ్యూస్‌లో సత్తా చూపిస్తూ పలు రికార్డులను సొంతం చేసుకుంటోంది. పదిరోజుల్లో ఈ సినిమాకు దాదాపు 16 మిలియన్ల వ్యూస్ (15.9) వచ్చినట్లు నెట్‌ప్లిక్స్ తెలిపింది. మొదటి మూడు రోజుల్లోనే 7.6మిలియన్ల వ్యూస్‌తో గ్లోబల్ టాప్-10 నాన్ ఇంగ్లీష్ ఫిల్మ్స్ జాబితాలో నెం.1 స్థానంలో నిలిచిన 'ధురంధర్'. ఫిబ్రవరి 2 నుంచి 8 వరకూ 8.2 మిలియన్ల వ్యూస్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఏకంగా 11 దేశాల్లో నం.1 స్థానంలో కొనసాగుతోంది.

తొలిభాగం సూపర్ హిట్ కావడంతో చిత్రబృందం రెట్టింపు ఉత్సాహంతో రెండో పార్ట్‌ను విడుదల చేసేందుకు సిద్ధమైంది. మొదటి భాగానికి మించి ఇది విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత జ్యోతి దేశ్‌పాండే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అందుకే ఐదు భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తొలి చిత్రానికి కొనసాగింపుగా 'ధురంధర్2' రెడీ అవుతోంది. మార్చి 19న ఈ చిత్రాన్ని విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్ పార్ట్2పై అందరినీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

------------

# ఇక డాక్టర్ శ్రీలీల

### ఎంబిబిఎస్ పట్టా పుచ్చుకున్న నటి



టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన జీవితంలో ఒక అద్భుతమైన ఘట్టాన్ని పూర్తిచేసుకుంది. వెండితెరపై నటిగా అలరిస్తున్న ఆమె, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీలగా మారారు. తన మెడికల్ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేసిన శ్రీలీల తాజాగా కాన్వోకేషన్ వేడుకలో మెడిసిన్ పట్టాను అందుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు ఫొటోలు వైరల్‌గా మారాయి. నిజానికి శ్రీలీల తన తల్లి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత గారిని స్ఫూర్తిగా తీసుకుని మెడిసిన్ వైపు అడుగులు వేశారు. గత ఏడాది చేతినిండా సినిమాలతో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన లక్ష్యం కోసం చదువుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఒక్కోసారి రోజంతా షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే, విరామ సమయంలో పుస్తకాలు చదువుతూ ఆమె పడ్డ శ్రమ ఇప్పుడు ఫలించింది. చిన్నతనంలో తన అమ్మమ్మ అనారోగ్యం పాలైనప్పుడు ఒక వైద్యురాలిగా సేవ చేయాలన్న తన కోరికను ఆమె నేడు నెరవేర్చుకున్నారు.



# చట్టం స్పోర్ట్స్

## రెండో మ్యాచ్‌కు టీమిండియా సిద్ధం

- టీమిండియా ముమ్మరంగా సాధన
- నేడు నమీబియాతో అమీతుమీ
- గ్రూప్-ఏలో ఢిల్లీ వేదికగా మ్యాచ్
- సంజూ శాంసన్ ఓపెనర్‌గా బరిలోకి..
- అభిషేక్ శర్మకు విశ్రాంతినిచ్చే చాన్స్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీని ఘనంగా ప్రారంభించిన టీమిండియా.. రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. గ్రూప్-ఏలో భాగంగా ఢిల్లీ వేదికగా జరిగే మ్యాచ్‌లో నమీబియాతో అమీతుమీ తేల్చుకోనుంది. అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో అతి కష్టం మీద గెలిచిన టీమిండియా.. ఈ మ్యాచ్‌లో దుమ్మురేపాలని భావిస్తోంది. ఆదివారమే ఢిల్లీకి చేరుకున్న టీమిండియా ముమ్మరంగా సాధన చేస్తోంది.అయితే ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ఈ మ్యాచ్ ఆడటం సందేహంగా మారింది. ప్రస్తుతం అతను ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడు. అమెరికాతో మ్యాచ్‌లోనూ ఇదే సమస్యతో బ్యాటింగ్ చేసిన అభిషేక్ శర్మ ఫీల్డింగ్‌కు రాలేదు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న అభిషేక్ శర్మ మంగళవారం ప్రాక్టీస్ సెషన్‌లో కనిపించలేదు. అభిషేక్ శర్మ ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడని బ్యాటింగ్ కోచ్ ర్యాన్ టెన్ దస్కాటే మీడియాకు తెలిపాడు. మ్యాచ్‌కు ఇంకా రెండు రోజుల సమయం ఉందని, ఆ సమయానికి కోలుకుంటాడని ఆశిస్తున్నామని చెప్పాడు. మరోవైపు సంజూ శాంసన్ నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. మరో ఓపెనర్ ఇషాన్ కిషన్‌తో కలిసి బ్యాటింగ్ సాధన చేశాడు. ఈ క్రమంలోనే నమీబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా నమీబియాతో మ్యాచ్ నుంచి అభిషేక్ శర్మకు విశ్రాంతి కల్పించనున్నారు.న్యూజిలాండ్‌తో సిరీస్‌లో దారుణంగా విఫలమై తుది జట్టులో చోటు కోల్పోయిన సంజూ శాంసన్‌కు ఇది సువర్ణవకాశం. ఈ మ్యాచ్‌లో అతను భారీ ఇన్నింగ్స్‌తో చెలరేగితే.. తుది జట్టులో కొనసాగుతాడు. ఓపెనర్లు ఇద్దరూ లెఫ్టార్మ్ బ్యాటర్లే అయిన నేపథ్యంలో సంజూ శాంసన్ ఫామ్‌లోకి వస్తే అతనికి ప్రాధాన్యత లభిస్తోంది.తీవ్ర జ్వరంతో అమెరికాతో మ్యాచ్‌కు దూరమైన జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇవ్వనున్నాడు. అదే జరిగే మహమ్మద్ సిరాజ్‌పై వేటు పడనుంది. అమెరికాతో మ్యాచ్‌లో సిరాజ్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. అయినప్పటికీ బుమ్రా రీఎంట్రీతో అతను బెంచ్‌కే పరిమితం కానున్నాడు. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌తో బరిలోకి దిగితే అర్ష్‌దీప్ సింగ్ కూడా బెంచ్‌కే పరిమితమవుతాడు. అతని స్థానంలో కుల్దీప్ యాదవ్ ఆడుతాడు.మిగతా కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ బ్యాట్ ఝులిపించాల్సిన అవసరం ఉంది.

### నమీబియాతో తలపడే భారత తుది జట్టు(అంచనా)

ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ/సంజూ శాంసన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్/కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా/మహమ్మద్ సిరాజ్, వరుణ్ చక్రవర్తీ.

## ఉత్కంఠ మధ్య సౌతాఫ్రికా విజయం

ప్రపంచం ఫిబ్రవరి 11, 2026ని గుర్తుంచుకుంటుంది. బుధవారం జరిగి మ్యాచ్‌లో అన్ని ఉత్కంఠభరితమైన పరిమితులను దాటింది. ఒకే మ్యాచ్‌లో రెండు సూపర్ ఓవర్లు. దీనిని టీ20 ప్రపంచ కప్ చరిత్రలో అత్యంత ఉత్కంఠభరితమైన పోటీ అని పిలవడం తప్పు కాదు. కొన్నిసార్లు ఆఫ్ఘనిస్తాన్ గెలుస్తుందని అనిపించింది. కొన్నిసార్లు దక్షిణాఫ్రికా తిరిగి పోరాడుతుంది. మ్యాచ్ ప్రతి క్షణం మారుతూనే ఉంది. కొన్నిసార్లు ఎవరైనా ఫ్రీ హిట్‌పై రనౌట్ అవుతారు, కొన్నిసార్లు సైరన్ మోగుతుంది. రెండు సూపర్ ఓవర్లు చివరి బంతికి వికెట్ , సిక్స్‌తో ముగిశాయి. చివరికి, దక్షిణాఫ్రికా గెలిచింది, ఆఫ్ఘన్ ఆటగాళ్లకు నిరాశ తప్ప మరేమీ మిగిల్చలేదు. టీ20 వరల్డ్ కప్‌లో బుధవారం సూపర్ మ్యాచ్ జరిగింది. బంతి బంతికి సస్పెన్స్‌తో మ్యాచ్ వావ్ అనిపించింది. మట్నదట మ్యాచ్ టై. ఆ తర్వాత సూపర్ ఓవర్ కూడా టై. మరో సూపర్ ఓవర్ లాస్ట్ బాల్ వరకూ టై వైపే వెళ్లింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో గ్రూప్ డీ ప్రత్యర్థి దక్షిణాఫ్రికాతో ఆఫ్ఘనిస్థాన్ పోటీ పడింది. టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్తాన్ దక్షిణాఫ్రికాపై బౌలింగ్ వేసి.. 6 వికెట్లకు 187 పరుగులకే పరిమితం చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ 19.4 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయింది. మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో ఆఫ్ఘనిస్తాన్ 17 పరుగులు చేసింది. అయితే దక్షిణాఫ్రికా ఆ స్కోరును సమం చేసింది. దాంతో మ్యాచ్‌ను మరో సూపర్ ఓవర్ వచ్చింది. రెండవ సూపర్ ఓవర్‌లో దక్షిణాఫ్రికా 24 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది, కానీ ఆఫ్ఘనిస్తాన్ ఆలౌట్ అయింది. ఆఫ్ఘనిస్తాన్ తన తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయింది. ప్రొటీస్ కెనడాపై విజయంతో తమ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆస్ట్రేలియా ఈ రోజు జరిగే రెండవ మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో తలపడుతుంది. ఇంగ్లాండ్ చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో తలపడుతుంది.



దక్షిణాఫ్రికా ప్లేయింగ్ 11 -- ఐడెన్ మార్క్రామ్ (కెప్టెన్), క్వింటన్ డి కాక్ (వికెట్ కీపర్), ర్యాన్ రికెల్టన్, డెవాల్డ్ బ్రూవిస్, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, మార్కో జాన్సన్, జార్జ్ లిండే (కార్బిన్ బాష్ స్థానంలో), కగిసో రబాడ, కేశవ్ మహారాజ్ మరియు లుంగి న్గిడి.

ఆఫ్ఘనిస్తాన్ ప్లేయింగ్ ఎలెవన్ - రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్, గుల్బాదిన్ నైబ్, సిదిఖుల్లా అటల్, దర్వేష్ రసూలీ, అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్ (కెప్టెన్), ఫజల్హక్ ఫరూఖీ, నూర్ అహ్మద్ మరియు ముహమ్మద్ రెహమాన్.

## నా బౌలింగ్‌కు భారత్ భయపడుతోంది

### పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్



భారత అభిమానులు తన బౌలింగ్ చూసి భయపడుతున్నారని పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ అన్నాడు. అందుకే తన బౌలింగ్ గురించి ఎక్కువగా చర్చిస్తున్నారని అభిప్రాయపడ్డాడు. అమెరికాతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఉస్మాన్ తారిక్ (3/27) మూడు వికెట్లతో పాకిస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే ఉస్మాన్ తారిక్ బౌలింగ్ శైలి వివాదాస్పద రీతిలో ఉండటంతో సోషల్ మీడియా వేదికగా విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా భారత నెటిజన్లు ఉస్మాన్ తారిక్‌ది త్రో బౌలింగ్ అని, ఐసీసీ ఎలా అనుమతిచ్చిందని ప్రశ్నించారు. ఉస్మాన్ తారిక్.. బంతిని విసిరే ముందు తన చేతులను విభిన్న కోణాల్లో తిప్పుతూ.. బ్యాటర్ దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తాడు. అతని యాక్షన్‌లో ఒక రకమైన 'హెజిటేషన్'ఉంటుంది. ఆగి ఆగి వేయడం వల్ల బ్యాటర్ టైమింగ్ దెబ్బతింటుంది. చూడటానికి త్రో బౌలింగ్‌లా కనిపిస్తోంది.అమెరికాతో మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న ఉస్మాన్ తారిక్ ముందు భారత నెటిజన్ల విమర్శలను ప్రశ్నించగా..తన బౌలింగ్ చూసి వారంతా ఒత్తిడికి గురవుతున్నారని చెప్పాడు. 'ప్రస్తుతం జరుగుతున్న చర్చలు చూస్తుంటే.. ఒత్తిడి మాపై కంటే భారత జట్టుపైనే ఎక్కువగా ఉంటుందని నా అభిప్రాయం. వారు కొన్ని విషయాలను వ్యతిరేకిస్తున్న తీరు చూస్తుంటే అది స్పష్టమవుతోంది. అయితే మీడియాలో ఏం జరుగుతుందో నాకు అనవసరం. నా దృష్టి అంతా నా క్రికెట్, ప్రాక్టీస్‌పైనే ఉంది.'అని ఉస్మాన్ తారిక్ తెలిపాడు.జట్టు ప్రదర్శనపై వస్తున్న విమర్శలకు సమాధానంగా రికార్డుల గురించి ఆయన ఒక కొత్త కోణాన్ని ప్రస్తావించాడు. 'మనం రికార్డులను కేవలం ఓడిపోవడం ప్రారంభించినప్పటి నుంచి కాకుండా, మొదటి నుంచి లెక్కించాలి. అలా చూస్తే మనకు మంచి రికార్డు ఉందనే విషయం తెలుస్తుంది. అవి కూడా టైటిల్ మ్యాచ్‌లే అన్న విషయాన్ని మర్చిపోకూడదు. పాత విజయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నప్పుడే జట్టు అసలు బలం తెలుస్తుంది.'అని ఉస్మాన్ పేర్కొన్నాడు.టీ20 ప్రపంచకప్‌లో తదుపరి మ్యాచ్‌ల గురించి మాట్లాడుతూ.. జట్టు అంతా ఒకే లక్ష్యంతో ఉందని స్పష్టం చేశాడు. ప్రపంచకప్ గెలవడమే తమ లక్ష్యమని చెప్పాడు. 'హైప్ గురించి ఆలోచిస్తే ఒత్తిడి పెరుగుతుంది. అందుకే మేం విషయాన్ని సింపుల్‌గా ఉంచాలనుకుంటున్నాము. మా ప్లాన్ ప్రకారం ఆడితే విజయం మాదే. భారత్‌తో మ్యాచ్‌ను మరో సాధారణ మ్యాచ్‌లానే చూస్తున్నాం.'అని ఉస్మాన్ తారిక్ చెప్పుకొచ్చాడు.

## డబ్బు కోసమే పాక్ దిగివచ్చింది: హర్భజన్ సింగ్



టీ20 వరల్డ్ కప్ 2026లో ఫిబ్రవరి 15న జరగనున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌పై నెలకొన్న హైడ్రామా ముగిసింది. మొదట ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తామని భీష్మించుకు కూర్చున్న పాకిస్థాన్, చివరి నిమిషంలో యూ-టర్న్ తీసుకుంది. ఈ నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, సౌరవ్ గంగూలీ, మదన్ లాల్ వంటి ప్రముఖులు తమదైన శైలిలో స్పందించారు. పాక్ వెనక్కి తగ్గడానికి ప్రధాన కారణం డబ్బు, ఐసీసీ జరిమానాల భయమేనని వారు విశ్లేషిస్తున్నారు.టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ పాకిస్థాన్ నిర్ణయాన్ని తీవ్రంగా ఎద్దేవా చేశారు. "భారత్ లేకపోయినా ఈ టోర్నీ సాగుతుంది కానీ, భారత్ లేకపోతే ఏదీ జరగదు అన్న నిజాన్ని పాకిస్థాన్ ఆలస్యంగా గుర్తించింది. బంగ్లాదేశ్‌కు మద్దతు ఇస్తున్నామని, భారత్‌తో ఆడబోమని గొప్పలు చెప్పుకున్నారు. కానీ ఈ మ్యాచ్ ఆడకపోతే వచ్చే ఆర్థిక నష్టం, ఐసీసీ విధించే జరిమానాలు, భవిష్యత్తులో టోర్నీల ఆతిథ్య హక్కులు కోల్పోతామనే భయం వారిని ఉక్కిరిబిక్కిరి చేశాయి. అందుకే ఇప్పుడు గత్యంతరం లేక దారిలోకి వచ్చారు" అని భజ్జీ ఎఎన్ఐతో మాట్లాడుతూ పేర్కొన్నారు.మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మాత్రం ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. క్రీడలను, రాజకీయాన్ని విడివిడిగా చూడాలని ఆయన అభిప్రాయపడ్డారు. "భారత్-పాక్ మ్యాచ్‌లు ఎప్పుడూ ఉత్సాహాన్నిస్తాయి. గత కొన్నేళ్లుగా పాకిస్థాన్ నుంచి సరైన పోటీ లేకపోయినా, ఈ మ్యాచ్ జరగడం మంచి పరిణామం. టీమిండియా ప్రస్తుతం చాలా బలంగా ఉంది, వారిని ఓడించడం పాకిస్థాన్‌కు అంత సులభం కాదు" అని గంగూలీ వ్యాఖ్యానించారు.మరో మాజీ క్రికెటర్ అతుల్ వాసన్ పాక్ తీరును డ్రామాగా అభివర్ణించారు. "ఒకసారి ఆడమంటారు, మరోసారి కోపం అంటారు. ఇలాంటి వింత చేష్టల వల్ల పాక్ ఆటగాళ్ల మనోధైర్యం దెబ్బతింటుంది. ఐసీసీ మీద కోపం ఉంటే టోర్నీ మొత్తాన్నే బహిష్కరించాలి కానీ, కేవలం భారత్ మ్యాచ్‌ను ఇష్యూ చేయడం ఏంటి?" అని ఆయన ప్రశ్నించారు. అలాగే, 1983 వరల్డ్ కప్ హీరో మదన్ లాల్ మాట్లాడుతూ.. ఈ మ్యాచ్ జరగకపోతే టోర్నీ కళ తప్పుతుందని, శ్రీలంక, బంగ్లాదేశ్ ఒత్తిడి వల్ల పాక్ వెనక్కి తగ్గడం శుభపరిణామమని అన్నారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో, కోల్‌కతా నైట్ రైడర్స్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను బీసీసీఐ స్క్వాడ్ నుంచి తొలగించగా, భద్రతా కారణాల దృష్ట్యా తమ మ్యాచ్‌లను భారత్ వెలుపల నిర్వహించాలని బంగ్లాదేశ్ కోరింది. ఐసీసీ దీనిని తిరస్కరించడంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను చేర్చారు. దీనికి నిరసనగా పాకిస్థాన్ మొదట భారత్ మ్యాచ్‌ను బహిష్కరించాలని చూసింది. అయితే, శ్రీలంక అధ్యక్షుడు, ఐసీసీ అధికారులతో చర్చల అనంతరం, పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తన జట్టును ఫిబ్రవరి 15న కొలంబోలో ఆడాలని ఆదేశించారు.

............

## ధోని ప్రపంచ రికార్డును సమం చేసిన డి కాక్



ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026లో చిన్న జట్లు అద్భుతంగా రాణిస్తాయి. పెద్ద జట్లను దాదాపు ఓడించినంత పని చేస్తున్నాయి. మరోవైపు స్టార్ క్రికెటర్లు రికార్డుల వేటలో పడ్డారు. దక్షిణాఫ్రికా స్టార్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డి కాక్ మాజీ భారత కెప్టెన్ ధోనీ ప్రపంచ రికార్డును సమం చేశాడు. కెనడాతో జరిగిన మ్యాచ్‌లో క్వింటన్ రెండు క్యాచ్‌లు అందుకున్నాడు. దీంతో డికాక్ టీ20 ప్రపంచ కప్‌లో అత్యధిక వికెట్ల రికార్డులో ధోనీతో సమం చేశాడు. టీ20 ప్రపంచ కప్‌లో డికాక్ మొత్తం 32 వికెట్లలో భాగస్వామిగా ఉన్నాడు. ధోనీ కూడా తన టీ20 ఇంటర్నేషనల్ కెరీర్‌లో 32 మంది బ్యాటర్లను వికెట్ కీపింగ్ ద్వారా డిస్మిసల్స్ చేశాడు. ఇప్పుడు డి కాక్ చరిత్ర సృష్టించడానికి ఒక్క అడుగు దూరంలో ఉన్నాడు. నెక్స్ మ్యాచ్‌లో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించవచ్చు. పొట్టి ప్రపంచ కప్ చరిత్రలో అత్యధిక వికెట్లలో పాలు పంచుకున్న వికెట్ కీపర్ విషయానికి వస్తే.. టాప్ లో క్వింటన్ డికాక్, ఎంఎస్ ధోనీ ఉన్నారు. కమ్రాన్ అక్మల్ మూడో స్థానంలో, వెస్టిండీస్ దినేష్ రామదిన్ నాల్గవ స్థానంలో, శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర, ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ ఐదవ స్థానంలో ఉన్నారు.కెనడాతో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ప్రోటీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్రమ్ అర్ధ సెంచరీ సాధించి 59 పరుగులు చేశాడు. రయాన్ రికల్టన్ 33 పరుగులు, డేవిడ్ మిల్లర్ 23 బంతుల్లో 39 పరుగులు, ట్రిస్టన్ స్టబ్స్ 19 బంతుల్లో 34 పరుగులు చేశారు. కెనడా బౌలర్ అంష్ పటేల్ మెరిశాడు. 31 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. 214 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన కెనడా జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు మాత్రమే చేసింది. నవనీత్ ధాలివాల్ 64 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇతర బ్యాటర్ల నుంచి అతడికి సహకారం లభించలేదు.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999